http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

మంగళవారం 24 మార్చి 2026

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828

## అది భస్మాసుర హస్తంగా మారింది



- 'కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రతి ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు
- ఇప్పుడు రూ.12 వేలు ఇస్తామని బడ్జెట్‌లో చెబుతున్నారు
- ఈ ప్రభుత్వం రూ.19 వేల కోట్ల రైతు బంధు ఎగ్గొట్టింది.
- మాజీ మంత్రి హరీష్‌రావు

**హైదరాబాద్**

తెలంగాణ ప్రభుత్వం మాయమాటలతో రైతులను మభ్యపెడుతోందని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. రైతుల పాలిట అభయ హస్తం భస్మాసుర హస్తంగా మారిందని విమర్శించారు. ఇచ్చిన మాట ప్రకారం రైతు భరోసాను రూ.15 వేలకు ఎప్పుడు పెంచుతారో చెప్పాలని నిలదీశారు. ఇవాళ తెలంగాణ అసెంబ్లీలో హరీష్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కారు తీరుపై విమర్శలు గుప్పించారు. - మిగతా3లో



## డీఎంకేదే అధికారం

- తమిళనాడులో డీఎంకే కూటమికి 180 సీట్లు
- అన్నాడీఎంకే అలయెన్స్ 54 స్థానాలకే పరిమితం: లేటెస్ట్ సర్వే
- త్వరలో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు
- ముమ్మరంగా డీఎంకే, అన్నాడీఎంకే కూటములు, టీవీకే ప్రచారం
- ఈ క్రమంలో విపక్ష అన్నాడీఎంకే కూటమికి షాక్ ఇచ్చిన 'అగ్ని న్యూస్ సర్వీస్' సర్వే

## మూసీ అభివృద్ధిని ఆపేస్తాం అనకండి

- కావాలంటే ఆ ముగ్గురితో ప్రత్యేక కమిటీ : సీఎం
- ప్రత్యేక ప్రణాళిక ప్రకారం ముందుకెళ్తున్నాం
- మానవ తప్పిదాల వల్లే అనేక సమస్యలు వస్తున్నాయి
- దూరం తగ్గించేందుకు మూసీపై ఎలివేటెడ్ కారిడార్లు వేస్తాం
- శాసనమండలిలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన



**హైదరాబాద్**

మూసీ నది అభివృద్ధిలో భాగంగా ఎవరినీ నిరాశ్రయులను చేయమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మూసీ పరిధిలో ఉన్న బాధితులందరికీ పునరావాసం కల్పిస్తామన్నారు. మెరుగైన జీవన విధానానికి కావాల్సిన ప్రమాణాలు, విద్య, వైద్య సదుపాయాలు కల్పించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. మూసీ పరివాహకంలో ఉన్న అందరికీ తగిన న్యాయం చేస్తామని శాసనమండలిలో ప్రకటించారు. రెచ్చగొట్టే వారి ఉచ్చులో పడవద్దని మూసీ ప్రాంత ప్రజలను కోరుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్ చారిత్రక నగరం, అనేక సరస్సులు, చెరువులు, గొప్ప కట్టడాలు ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మానవ తప్పిదాల వల్లే ఇవాళ అనేక సమస్యలు వస్తున్నాయని చెప్పారు. ఆదాయ మార్గాలు పెరిగి - మిగతా3లో



## ప్రపంచంలో ఎక్కడ సమస్య వచ్చినా భారత్‌పై ప్రభావం

- భారత్‌కు కూడా సవాళ్లు ఎదురవుతున్నాయి
- యుద్ధం వల్ల ఇతర దేశాలతో జరిగే వాణిజ్యం దెబ్బతింటోంది
- లోక్‌సభలో ప్రసంగించిన ప్రధాని మోదీ
- దేశీయ ఉత్పత్తిని కూడా పెంచుతున్నామని స్పష్టం



## 'ఈ ఏడాది అమెరికాలో జరగబోయే జీ20 సమ్మిట్ వల్ల నో యూజ్'

- పశ్చిమాసియా సంక్షోభాన్ని పరిష్కరించేందుకు 'విశ్వగురు' మోదీ ఎందుకు ప్రయత్నించట్లేదు?
- మిడిల్ ఈస్ట్‌లో అంతకంతకూ ముదురుతున్న యుద్ధం
- అక్కడి సంక్షోభాన్ని పరిష్కరించేందుకు ప్రధాని మోదీ దౌత్యపరమైన చొరవ తీసుకోవాలని కాంగ్రెస్ డిమాండ్
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్, నెతన్యాహులను వ్యతిరేకించడం మోదీకి ఇష్టం లేదని ఎద్దేవా

## త్వరలో మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణ



- కేబినెట్‌లో పలు మార్పులు, చేర్పులు!
- అసెంబ్లీ సమావేశాలు ముగిశాక కసరత్తు
- ఇద్దరు, ముగ్గురు మంత్రులకు ఉద్వాసన పలికే ఛాన్స్
- అజారుద్దీన్‌కు ఇప్పటివరకు దక్కని ఎమ్మెల్సీ
- ఉత్తర, దక్షిణ తెలంగాణ సమతుల్యతను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు

**హైదరాబాద్**

ఏప్రిల్, మే నెలల్లో రాష్ట్ర మంత్రివర్గంలో మార్పులు, చేర్పులు ఉంటాయని కాంగ్రెస్ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. మంత్రుల పని తీరు, సామాజిక వర్గాలు, ప్రాంతీయ సమతుల్యత ఈ మూడు అంశాలే ప్రామాణికంగా కేబినెట్ పునర్ వ్యవస్థీకరణకు ఏఐసీసీ పచ్చజెండా ఊపినట్లు పీసీసీ వర్గాలు చెబుతున్నాయి. మంత్రివర్గంలో నుంచి ఎవరిని తొలిగిస్తారు? ఎవరిని కొత్తగా చేర్చుకుంటారన్న అంశంపై ఇప్పటికైతే స్పష్టత లేదు. ఇప్పటికీ పూర్తిస్థాయిలో విస్తరించని మంత్రివర్గం : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండేళ్లు దాటింది. అయితే ఇప్పటికీ - మిగతా3లో



## మండిపోతున్న మెట్రో ఛార్జీలు!

- దిల్లీలో కంటే ఇక్కడే ఎక్కువ
- దేశంలోని వివిధ నగరాల్లో మెట్రో ఛార్జీల సవరణలు
- దిల్లీలో తక్కువ - హైదరాబాద్ నగరంలో అధికం
- మెట్రో ఛార్జీలతో ప్రయాణం భారం!
- హైదరాబాద్ మెట్రో ఛార్జీలు ఎలా ఉన్నాయంటే?

**హైదరాబాద్**

దిల్లీ మెట్రో ప్రపంచంలోనే అత్యంత చౌకైన రవాణా వ్యవస్థల్లో ఒకటిగా నిలుస్తోంది. దేశ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్)లో విస్తృతమైన మెట్రో నెట్‌వర్క్ ఉంది. విస్తరణపరంగా వెనకబడిన హైదరాబాద్ మెట్రోలో ప్రయాణ ఛార్జీలు ఏమో దిల్లీ మెట్రో కన్నా ఎక్కువగా ఉన్నాయి. మెట్రో విస్తరణ ఎంత ప్రధానమో, ప్రయాణ ఛార్జీలు అందుబాటులో ఉండటం అంతే ముఖ్యమని ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు. మెట్రోలో - మిగతా3లో



## ఇరాన్‌కు కశ్మీరీలు భారీ సాయం

- నగదు, బంగారం, నిత్యావసరాలు విరాళం
- కృతజ్ఞతలు తెలిపిన ఎంబసీ
- యుద్ధంతో ప్రభావితమైన ఇరాన్ ప్రజలకు కశ్మీర్ ప్రజలు సాయం
- నగదు, బంగారు, వెండి వస్తువులను సేకరించి పంపించిన ప్రజలు
- పోస్ట్ చేసిన ఇరాన్ ఎంబసీ

# ప్రపంచంలో ఎక్కడ సమస్య వచ్చినా భారత్‌పై ప్రభావం

పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితులు ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆ సంక్షోభం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై మాత్రమే కాకుండా ప్రజల జీవన విధానంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోందని ఆయన అన్నారు. సోమవారం లోక్‌సభలో ఆ అంశంపై మాట్లాడిన ప్రధాని, పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయని స్పష్టం చేశారు.

అమెరికా-ఇజ్రాయెల్- ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఆ యుద్ధం నాలుగో వారంలోకి ప్రవేశించింది. దీని ప్రభావం భారత్‌పై కూడా పలు రంగాల్లో కనిపిస్తుందని మోదీ చెప్పారు. ముఖ్యంగా ఆర్థిక, భద్రతా, మానవతా కోణాల్లో సవాళ్లు ఎదురవుతున్నాయని వివరించారు. భారత్‌కు అవసరమైన ముడి చమురు, సహజ వాయువు (గ్యాస్)లో పెద్ద భాగం పశ్చిమాసియా దేశాల నుంచే వస్తుందని ప్రధాని గుర్తు చేశారు. ఆ ప్రాంతం ఇతర దేశాలతో వాణిజ్యానికి కీలక మార్గంగా కూడా పనిచేస్తుందని చెప్పారు. అందువల్ల అక్కడి పరిస్థితులు దిగుమతులు, ఎగుమతులు, సముద్ర మార్గ రవాణాపై ప్రభావం చూపుతున్నాయని వివరించారు.

హర్మూజ్ జలసంధి ద్వారా భారత్‌కు భారీ స్థాయిలో చమురు, గ్యాస్, ఎరువులు వంటి కీలక వస్తువులు రవాణా అవుతున్నాయని తెలిపారు. అయితే యుద్ధ పరిస్థితుల వల్ల ఆ మార్గంలో నౌకల రాకపోకలు కష్టతరంగా మారాయని అన్నారు. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుని పెట్రోల్, డీజిల్, గ్యాస్ సరఫరా అంతరాయం కలగకుండా చూసిందని మోదీ స్పష్టం చేశారు. దేశంలో ఎల్‌పీజీ వినియోగం ఎక్కువగా దిగుమతులపై ఆధారపడి ఉందని ఆయన తెలిపారు. సుమారు 60 శాతం ఎల్‌పీజీ అవసరాలు దిగుమతుల ద్వారానే నెరవేరుతున్నాయని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశీయ వినియోగదారులకు ప్రాధాన్యం ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని,



అంతేకాకుండా దేశీయ ఉత్పత్తిని కూడా పెంచుతున్నామని వెల్లడించారు.

పశ్చిమాసియాలో దాదాపు ఒక కోటి మంది భారతీయులు నివసిస్తూ పనిచేస్తున్నారని ప్రధాని గుర్తు చేశారు. అలాగే వాణిజ్య నౌకల్లో కూడా పెద్ద సంఖ్యలో భారతీయ సిబ్బంది ఉన్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో అక్కడి పరిస్థితులపై భారత్‌కు సహజంగానే ఎక్కువ ఆందోళన ఉంటుందని చెప్పారు. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి అక్కడ ఉన్న భారతీయుల భద్రతను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటున్నామని మోదీ తెలిపారు. ఇప్పటికే పశ్చిమాసియా దేశాల అధినేతలతో రెండు దఫాలుగా మాట్లాడినట్లు చెప్పారు. భారతీయుల భద్రతకు వారు హామీ ఇచ్చారని వెల్లడించారు.

**భారతీయులకు 24 గంటల హెల్ప్‌లైన్లు, ఎమర్జెన్సీ సేవలు**

సంక్షోభం సమయంలో ఇప్పటివరకు 3.75 లక్షల మంది భారతీయులు సురక్షితంగా స్వదేశానికి చేరుకున్నారని తెలిపారు. ఇరాన్ నుంచి మాత్రమే దాదాపు వెయ్యి మంది తిరిగి వచ్చినట్లు చెప్పారు. అందులో 700 మందికి పైగా వైద్య విద్యార్థులు ఉన్నారని వెల్లడించారు. యుద్ధ ప్రభావిత ప్రాంతాల్లో కొన్ని మరణాలు, గాయాలు సంభవించాయని ప్రధాని విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. విదేశాల్లో ఉన్న భారతీయులకు 24 గంటల హెల్ప్‌లైన్లు, ఎమర్జెన్సీ సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని గల్ఫ్ దేశాల్లో సీబీఎస్ఈ 10, 12వ తరగతి పరీక్షలను రద్దు చేసినట్లు మోదీ పేర్కొన్నారు. విద్యలో అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి సంక్షోభాలను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు రూపొందించిందని ప్రధాని వివరించారు. దేశంలో వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలను గణనీయంగా పెంచినట్లు చెప్పారు. ప్రస్తుతం భారత్ వద్ద 5.3 మిలియన్ మెట్రిక్ టన్నుల కంటే ఎక్కువ నిల్వలు ఉన్నాయని, వాటిని 6.5 మిలియన్ మెట్రిక్ టన్నులకు పెంచే దిశగా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

అదేవిధంగా గతంలో 27 దేశాల నుంచి మాత్రమే ఇంధనాన్ని దిగుమతి చేసుకునే భారత్, ఇప్పుడు 41 దేశాల నుంచి దిగుమతులు చేసుకుంటోందని మోదీ చెప్పారు. ఇది సరఫరా భద్రతను పెంచేందుకు తీసుకున్న ముఖ్యమైన నిర్ణయమని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఏర్పడుతున్న క్లిష్ట పరిస్థితులు దీర్ఘకాలిక ప్రభావం చూపే అవకాశం ఉందని ప్రధాని హెచ్చరించారు. కాబట్టి దేశం ఐక్యంగా ఉండి ఈ సవాళ్లను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. కరోనా సమయంలో చూపిన ఐక్యతను మరోసారి ప్రదర్శించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.

# 'ఈ ఏడాది అమెరికాలో జరగబోయే జీ20 సమ్మిట్ వల్ల నో యూజ్'

పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభాన్ని పరిష్కరించేందుకు దౌత్యపరమైన చొరవ కోసం స్వయం ప్రకటిత 'విశ్వగురు' అయిన భారత ప్రధాని నరేంద్ర మోదీ బ్రిక్స్ సదస్సును ఎందుకు ముందుకు తీసుకెళ్లడం లేదని కాంగ్రెస్ మండిపడింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహులను వ్యతిరేకించడం మోదీకి ఇష్టం లేదని ఆరోపించింది. ఈ మేరకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్స్ ఇన్‌ఛార్జ్) జైరాం రమేశ్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. "ఈ ఏడాది చివర్లో భారత్ అధ్యక్షతన దిల్లీలో 18వ వార్షిక బ్రిక్స్ సదస్సు జరగనుంది. ఇందులో బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా, అర్జెంటీనా, ఈజిప్ట్, ఇథియోపియా, సౌదీ అరేబియా, ఇరాన్, యూఏఈ సభ్య దేశాలుగా ఉన్నాయి. పశ్చిమాసియా సంక్షోభాన్ని, దాని ప్రభావాలను ఎదుర్కోవడానికి ఒక దౌత్యపరమైన చొరవ తీసుకునేందుకు ఉద్దేశించిన శిఖరాగ్ర సమావేశాన్ని స్వయం ప్రకటిత 'విశ్వగురు' అయిన ప్రధాని మోదీ ఎందుకు ముందుకు తీసుకెళ్లడం లేదు? దీన్ని బట్టి మోదీకి యూఎస్ అధ్యక్షుడు ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహులను వ్యతిరేకించడం ఇష్టం లేదని స్పష్టంగా అర్థమవుతోంది" అని జైరాం రమేశ్ విమర్శించారు.

పశ్చిమాసియాలోని పరిస్థితులపై చర్చించడానికి భారత ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ నాయకులకు ఫోన్ కాల్స్ చేస్తున్నారని జైరాం రమేశ్ తెలిపారు. "ఈ సంభాషణలలో మన ఎల్ సుప్రీమోకు (మోదీకి) ఆలింగనాలు ఉండవు. చేతి వేలు ఊపుతూ, జ్ఞానబోధ చేస్తూ ఫొటోలు దిగే అవకాశాలు ఉండవు. అయితే శిఖరాగ్ర సమావేశాల్లో విలువైన



ముఖాముఖి చర్చలు జరపొచ్చు. ఏదైనా సంక్షోభానికి సంబంధించిన నిర్దిష్టమైన చర్యలను తీసుకోవచ్చు. ఈ ఏడాది జీ20కి అమెరికా అధ్యక్షత వహిస్తోంది. అప్పుడు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరిన్ని ఆవేశపూరిత ప్రసంగాలు, ఎగతాళి మాటలు తప్ప ఆ సమ్మిట్ వల్ల చెప్పుకోదగ్గ ఫలితాలేమీ ఉండవు" అని జైరాం రమేశ్ పేర్కొన్నారు.

**దౌత్యపరమైన పరిష్కారం కావాలి: మనీశ్ తివారీ**

పశ్చిమాసియా సంఘర్షణ కారణంగా సరఫరా గొలుసులో ఏర్పడుతున్న అంతరాయాలపై కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి దౌత్యపరమైన పరిష్కారం కావాలని పిలుపునిచ్చారు. ముడి చమురు, సహజ వాయువు, ఎరువులు, ఆహారం, ఔషధాల సరఫరా గొలుసు అంతరాయం వల్ల కలిగే పరిణామాలను ప్రస్తావించారు. ఇంధనాన్ని వినియోగించే దేశాలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి ప్రశ్నలు లేవనెత్తారు.

**'అక్కడ నిరూపయోగంగా మూడు వేల నౌకలు'**

"పశ్చిమాసియా సంక్షోభం అత్యంత ప్రమాదకరమైన దశలోకి ప్రవేశించింది. గల్ఫ్ ఆఫ్ ఒమన్ , పర్షియన్ గల్ఫ్‌లో 3000 నౌకలు నిరుపయోగంగా ఉన్నాయి. ఇజ్రాయెల్, అమెరికా, ఇరాన్ తమ ఉద్రిక్తతలను తగ్గించుకోవాలి. దౌత్య మార్గం ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలి. ఇంధనాన్ని వినియోగించే దేశాల్లో పరిస్థితి అంతకంతకు దిగజారుతోంది. ఎందుకంటే ఇది కేవలం ముడి చమురు, సహజ వాయువుకు సంబంధించిన విషయం మాత్రమే కాదు. ఎరువులు, ఆహారం, ఔషధాలు, ప్రాణాలను కాపాడే అత్యవసర మందులకు కూడా సంబంధించినది. మొత్తం సరఫరా గొలుసు దెబ్బతింది" అని మనీశ్ తివారీ పేర్కొన్నారు.

**మోదీ అధ్యక్షతన మీటింగ్**

కాగా, పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల వేళ ప్రధాని మోదీ అధ్యక్షతన ఆదివారం సాయంత్రం భద్రత వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీఎస్) సమావేశం జరిగింది. ఈ మీటింగ్‌లో దేశంలో పెట్రోలియం, విద్యుత్, ఎరువుల రంగాల స్థితిగతులపై సీనియర్ మంత్రులతో చర్చించారు మోదీ. ఈ సమావేశంలో కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్ నాథ్ సింగ్, జేపీ నడ్డా, శివరాజ్ సింగ్ చౌహాన్, నిర్మలా సీతారామన్, జైశంకర్, రామ్మోహన్ నాయుడు, హర్దీప్ సింగ్ పురి, సర్బానంద సోనోవాల్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ తదితరులు పాల్గొన్నారు. గ్యాస్, పెట్రోల్, ఎరువుల సరఫరాలో ఇబ్బందులు రాకుండా చూడాలని ప్రధాని మోదీ ఆదేశించారు.

# దేశీయ విమానయాన సంస్థల సమ్మర్ షెడ్యూల్ రిలీజ్ చేసిన డీజీసీఏ

దేశీయ విమానయాన సంస్థల వేసవి విమాన సర్వీసుల షెడ్యూల్‌ను డైరెక్టరేట్ జనరల్ ఫర్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) విడుదల చేసింది. ప్రయాణికులు సంబంధిత విమానయాన సంస్థల వెబ్‌సైట్‌ను సరిచూసుకోవాలని సూచించింది. అలాగే కార్యాచరణ అత్యవసర పరిస్థితుల కారణంగా చివరి నిమిషంలో విమాన షెడ్యూల్‌లో మార్పులు జరిగితే ఆయా విమానయాన సంస్థలను సంప్రదించాలని కోరింది. ఈ మేరకు మార్చి 29 నుంచి అక్టోబర్ 24 వరకు వర్తించే దేశీయ విమాన సర్వీసుల సమ్మర్ షెడ్యూల్‌ను సోమవారం రిలీజ్ చేసింది.

**విమాన ఛార్జీలపై పరిమితులు ఎత్తివేత**

దేశీయ విమాన ఛార్జీలపై విధించిన తాత్కాలిక పరిమితులను ఎత్తివేస్తున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ ఆదివారం ప్రకటించింది. ఈ నిర్ణయం మార్చి 23 (సోమవారం) నుంచి అమల్లోకి వస్తుందని తెలిపింది. గతేడాది డిసెంబర్‌లో ఇండిగో సంక్షోభం కారణంగా ప్రభుత్వం విధించిన ఈ పరిమితులను తొలగిస్తున్నట్లు పేర్కొంది. విమాన టికెట్ల ధరలపై పరిమితులు ఇకపై అవసరం లేదని తెలియజేస్తూ కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఓ ఉత్తర్వును ఆదివారం జారీ చేసింది. కాగా, ఈ నిర్ణయం మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా విమాన టికెట్ ధరలను నిర్ణయించుకోవడానికి విమానయాన సంస్థలకు అనుమతిస్తుంది. "ఇండిగో విమాన సర్వీసులకు భారీ స్థాయిలో అంతరాయం కలగడం వల్ల టికెట్ల ధరలలో తలెత్తే అసాధారణ పెరుగుదలను అరికట్టేందుకు గతేడాది డిసెంబరు 6న విమాన ఛార్జీలపై తాత్కాలిక పరిమితులు విధించాం. ప్రయాణీకుల ప్రయోజనాలను కాపాడడానికి, విమాన టికెట్లు అందుబాటులో ఉండేలా చూసేందుకు ఆ నిర్ణయం తీసుకున్నాం. ప్రస్తుతం విమానసంస్థల కార్యకలాపాలు సద్దుమణిగాయి.



అందుకే గతేడాది డిసెంబర్‌లో విధించిన ఛార్జీల పరిమితిని 2026 మార్చి 23 నుంచి ఉపసంహరించుకుంటున్నాం." అని కేంద్ర పౌర విమానయాన శాఖ పేర్కొంది.

**'ధరల విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలి'**

దేశీయ విమాన ఛార్జీలపై విధించిన తాత్కాలిక పరిమితులను ఎత్తివేసినప్పటికీ, విమానయాన సంస్థలు ధరల విషయంలో క్రమశిక్షణ పాటించాలని పౌర విమానయాన శాఖ స్పష్టం చేసింది. ఎయిర్‌లైన్స్ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరింది. విమాన ఛార్జీలు సహేతుకంగా, పారదర్శకంగా, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ఉండేలా చూసుకోవాలని సూచించింది. అలాగే ప్రయాణీకుల ప్రయోజనాలపై ప్రతికూల ప్రభావం పడకుండా చూడాలని విజ్ఞప్తి చేసింది. ముఖ్యంగా అధిక డిమాండ్, విమాన సర్వీసుల్లో అంతరాయాలు, ఇతర అత్యవసర పరిస్థితుల సమయాల్లో ఛార్జీలను అధికంగా పెంచిన ఏ సందర్భాన్నైనా తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించింది. విమాన ఛార్జీలను పౌర విమానయాన శాఖ నిశితంగా పర్యవేక్షిస్తూనే ఉంటుందని పేర్కొంది.

**60శాతం సీట్లపై అదనపు ఛార్జీలు రద్దు!**

మరోవైపు, విమాన టికెట్ల అదనపు ఛార్జీల విషయంలో ఇటీవలే కేంద్ర పౌర విమానయాన శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. అన్ని విమానాల్లో కనీసం 60 శాతం సీట్లపై ఎలాంటి అదనపు ఛార్జీలు విధించకుండా ఉండేందుకు విమానయాన సంస్థలకు ఆదేశాలు జారీ చేసింది. ఆ అదేశాలపై దేశీయ విమానయాన సంస్థలు అసహనం వ్యక్తం చేశాయి. ఈ నిర్ణయంతో టికెట్ల ధరలను పెంచాల్సిన పరిస్థితి వస్తుందని పేర్కొన్నాయి. ఈ మేరకు ఇండిగో, ఎయిరిండియా, స్పైస్‌జెట్‌లకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎయిర్‌లైన్స్ కేంద్ర పౌర విమానయాన శాఖకు లెటర్ రాసింది. విమానాల్లో కనీసం 60 శాతం సీట్లపై ఎలాంటి అదనపు ఛార్జీలు విధించకుండా ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలు తమ కీలక ఆదాయ మార్గానికి గండి కొట్టే విధంగా ఉన్నాయని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎయిర్‌లైన్స్ తెలిపింది. ఈ చర్యల వల్ల విమానయాన సంస్థలపై తీవ్ర ఆర్థిక భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. తాము కోల్పోయిన ఆదాయాన్ని తిరిగి రాబట్టుకోవడానికి విమానయాన సంస్థలు ఛార్జీలు పెంచాల్సి వస్తుందని పేర్కొంది. ప్రయాణికుల ప్రయోజనం కోసం తీసుకున్న నిర్ణయం చివరికి వారికే ప్రతికూలంగా మారే అవకాశం ఉందని చెప్పింది. ఈ నిర్ణయం తరచుగా విమానాల్లో ప్రయాణించేవారికి మరింత నష్టం చేకూరుస్తుందని అభిప్రాయపడింది. ధరల నిర్ణయం, సీట్ల కేటాయింపు అనేవి కీలకమైన వ్యాపార నిర్ణయాలని స్పష్టం చేసింది.

## డీఎంకేదే అధికారం



త్వరలో జరగబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అధికార డీఎంకే కూటమి ప్రభంజనం సృష్టించనుందని చెన్నై కేంద్రంగా పనిచేసే 'అగ్ని న్యూస్ సర్వీస్' అనే సర్వే సంస్థ తేల్చింది. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే కూటమి 44.9శాతం ఓట్లను సాధిస్తుందని పేర్కొంది. రాష్ట్రంలోని మొత్తం 234 నియోజకవర్గాల్లో 180 స్థానాలను అధికార కూటమి కైవసం చేసుకునే అవకాశం ఉందని అంచనా వేసింది. విపక్ష అన్నాడీఎంకే కూటమికి మరోసారి ఎదురుదెబ్బ తగలనుందని సర్వే సంస్థ వెల్లడించింది. ఈ కూటమి 38.5శాతం ఓట్లను సాధించి, 54 సీట్లకే పరిమితమయ్యే ఛాన్స్ ఉందని స్పష్టం చేసింది.

**అన్నాడీఎంకేకి షాక్!**

అన్నాడీఎంకే కూటమికి ఈ ఎన్నికల్లో చెన్నై రీజియన్‌లో ఎదురుదెబ్బ తగలనున్నట్లు 'అగ్ని న్యూస్ సర్వీస్' అనే సర్వే సంస్థ అంచనా వేసింది. ఆ ప్రాంతంలో ఒక్క సీటు కూడా అన్నాడీఎంకే కూటమి గెలవదని పేర్కొంది. మధ్య తమిళనాడు ప్రాంతంలో పళనస్వామి నేతృత్వంలో కూటమి కేవలం 2 సీట్లు మాత్రమే దక్కించుకుంటుందని వెల్లడించింది. దీంతో అన్నాడీఎంకే కూటమి మరోసారి భారీ ఓటమిని చవిచూసే అవకాశం ఉందని స్పష్టం చేసింది.

**టీవీకే ప్రభావం అంతంతమాత్రమే!**

సినీనటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కజగం (టీవీకే) పార్టీ ఈ ఎన్నికల్లో అంతంతమాత్రమే ప్రభావితం చూపిస్తుందని సర్వే సంస్థ 'అగ్ని న్యూస్ సర్వీస్' అంచనా వేసింది. 9.7శాతం ఓట్లను టీవీకే సాధిస్తుందని వెల్లడించింది. అలాగే, సీమాన్ నేతృత్వంలోని నామ్ తమిళర్ కచ్చి పార్టీ 4.8శాతం ఓట్ల వాటాను పొందే ఛాన్స్ ఉందని, ఇతర పార్టీలు కలిపి 2.1శాతం ఓట్లను దక్కించుకుంటాయని సర్వే సంస్థ పేర్కొంది. రాబోయే ఎన్నికల్లో టీవీకే అధినేత విజయ్, నామ్ తమిళర్ కచ్చి పార్టీ ప్రధాన సమన్వయకర్త సీమాన్ ఇద్దరూ ఓటమిని చవిచూసే అవకాశం ఉందని అంచనా వేసింది.

## ఇరాన్‌కు కశ్మీరీలు భారీ సాయం



అమెరికా-ఇజ్రాయెల్ కలిసి ఇరాన్?పై దాడి చేయడంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ప్రతీకార దాడులతో యుద్ధం మరింత తీవ్రమవుతోంది. ఈ దాడుల వల్ల ఇరాన్?లోని చాలా ప్రాంతాలు దెబ్బతిన్నాయి. పాఠశాలలు, భవనాలు, ఆస్పత్రులు ధ్వంసమయ్యాయి. ఈ యుద్ధం వల్ల ఇప్పటికే 1000 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. అనేక మంది నిరాశ్రయులు అయ్యారు. ఈ క్రమంలో ఇరాన్?కు జమ్ముకశ్మీర్?లోని ప్రజలు భారీ సాయం అందించేందుకు ముందుకొచ్చారు. నగదు, బంగారు ఆభరణాలు, రాగి పాత్రలు వంటి పంపించారు. ఇందుకు భారత్?లోని ఇరాన్ రాయాబార కార్యాలయం కృతజ్ఞతలు తెలిపింది. యుద్ధంతో ప్రభావితమైన ఇరాన్ ప్రజలకు సహాయం చేయడానికి కశ్మీర్ ప్రజలు పెద్ద ఎత్తున విరాళాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యంగా షియాలు అధికంగా ఉన్న బుద్గామ్, బారాముల్లా జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. రంజాన్ మరుసటి రోజు ఆదివారం భారీ విరాళాలు వచ్చాయి. ప్రజలు నగదు మాత్రమే కాకుండా బంగారు ఆభరణాలు, పశువులు, సంప్రదాయ రాగి పాత్రలు వంటి విలువైన వస్తువులను కూడా విరాళంగా అందించారు.

**ఇంటింటికీ వెళ్లి సేకరణ**

ఇరానీయులకు సాయం చేసేందుకు ఇంటింటికి వెళ్లి విరాళాలు సేకరించారు. ఈ విరాళాల సేకరణ కార్యక్రమంలో పిల్లల దగ్గర నుంచి పెద్ద వరకు, మహిళలు, పురుషులు అందురు పాల్గొన్నారు. మహిళలు తమ బంగారు ఆభరణాలను విరాళంగా ఇచ్చారు. అలాగే ఇళ్లలోని విలువైన వస్తువులను, కొందరు తమ పశువులను కూడా సాయంగా ఇచ్చారు. పిల్లలు సైతం తమ పొదుపు నగదును, ఈద్ సందర్భంగా పొందిన డబ్బును ఇచ్చారు.

**'వారికి సాయం చేయడం మన బాధ్యత'**

ఇరాన్? ప్రజలకు సాయం చేయడానికి ఈ విరాళాల కార్యక్రమాన్ని చేపట్టినట్లు శ్రీనగర్?లోని రైనావారి ప్రాంతానికి చెందిన అజాబ్? అహ్మద్ ఓ వార్త సంస్థకు తెలిపారు. ఈ యుద్ధం వల్ల ఇరాన్?లో భారీ విధ్వంసం జరిగిందని పేర్కొన్నారు. ఈ దాడుల వల్ల బాధపడుతున్న ప్రజలకు సహాయం మన బాధ్యత అని చెప్పారు.

**ఇరాన్ ఎంబసీ కృతజ్ఞతలు**

ఇది కేవలం సాయం మాత్రమే కాదని భావోద్వేగ అనుబంధాన్ని కూడా చూపించిందని భారత్?లోని ఇరాన్ రాయబార? కార్యాలయం పేర్కొంది. విరాళాల ఫొటోలను పంచుకుంటూ ఎక్స్?లో పోస్ట్ చేసింది. కశ్మీర్ ప్రజల మానవత్వం, సాయం తమకు ఎప్పటికీ గుర్తుండిపోతాయని పేర్కొంది. కశ్మీర్? ప్రజలకు హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుతున్నామని చెప్పింది.

## సొంత నిర్ణయాలు తీసుకునే స్థితిలో భారత్ లేదు

**అంతా అమెరికా చేతిలోనే- కేరళ సీఎం పినరయి విజయన్**

పశ్చిమాసియా ఉద్రిక్తతలతో దేశంలో పెరుగుతున్న వంటగ్యాస్ ధరలు, కుదేలవుతున్న చిన్న తరహా పరిశ్రమలు, అంతర్జాతీయ వేదికపై భారత విదేశాంగ విధానంపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బీజేపీ నేతృత్వంలోని భారత ప్రభుత్వం ప్రస్తుతం స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోలేని పరిస్థితిలో ఉందని కేరళ సీఎం పినరయి విజయన్ ఆరోపించారు. సొంత వ్యూహాత్మక నిర్ణయాల కోసం అమెరికా ఆమోదం కోసం భారత్ వేచి చూసే పరిస్థితి దాపురించిందని దుయ్యబట్టారు. ఇది భారత సార్వభౌమాధికారానికి పెను ముప్పుగా ఆయన అభివర్ణించారు. కేంద్ర ప్రభుత్వం అమెరికా ప్రయోజనాలకు అనుగుణంగా నడుచుకుంటోందని, దీనివల్ల అంతర్జాతీయ స్థాయిలో భారత్ తన స్వతంత్రతను కోల్పోతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం కన్నూర్‌లో జరిగిన ఒక బహిరంగ సభలో మాట్లాడిన ఆయన, బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై ధ్వజమెత్తారు. కేంద్రం దేశ సార్వభౌమాధికారాన్ని అమెరికా వద్ద తాకట్టు పెడుతోందని మండిపడ్డారు.

# త్వరలో మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణ

-మొదటిపేజీ తరువాయి

పూర్తిస్థాయిలో మంత్రివర్గ విస్తరణ జరగలేదు. సామాజిక సమీకరణాలు కుదరకపోవడం, నేతల మధ్య పోటీ, ముఖ్య నాయకుల మధ్య ఏకాభిప్రాయం లేకపోవడం వంటి కారణాలతో ముందుకెళ్లలేని పరిస్థితి. 119 మంది ఎమ్మెల్యేలకు 15 శాతం అంటే ముఖ్యమంత్రితో కలిపి 18 మందిని కేబినెట్‌లోకి తీసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం 16 మంది మంత్రులు ఉన్నారు. ఇటీవల జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సమయంలో అజారుద్దీన్ ప్రజాప్రతినిధి కాకపోయినా ఏఐసీసీ సూచనల మేరకు మంత్రివర్గంలో చోటు ఇచ్చారు. ఏప్రిల్ 30లోపు ఆయన ఎమ్మెల్సీగా ఎన్నిక కానట్లయితే మంత్రి పదవి నుంచి దూరం కావాల్సి వస్తుంది. ఆలోపు ఏదో ఒక విధంగా సర్దుబాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

మంత్రులకు ఉద్వాసన పలికే ఛాన్స్ : కొందరు మంత్రులపై అధిష్ఠానం అసంతృప్తిగా ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పార్టీ నిర్దేశించిన నియమావళికి కట్టుబడకపోవడం, ఎమ్మెల్యేలకు అందుబాటులో ఉండకపోవడం, వర్గాలను పెంచి పోషించడం వంటి ఆరోపణలు కొందరు మంత్రులపై గట్టిగా వినిపిస్తున్నాయి. దీంతో రేవంత్ కేబినెట్‌లోని ఇద్దరు, ముగ్గురు మంత్రులకు ఉద్వాసన ఉంటుందనే ప్రచారం జోరుగా సాగుతోంది. అయితే ఈ ప్రక్రియలో అంతర్గత ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా పార్టీ హైకమాండ్ కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

**అసెంబ్లీ సమావేశాలు ముగిశాక**

ఏప్రిల్, మే నెలల్లో మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణ జరిగే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తర్వాత ఇందుకు సంబంధించిన కసరత్తు వేగవంతమవుతుందని అంచనా వేస్తున్నారు. ఖాళీగా ఉన్న రెండు మంత్రి పదవులు భర్తీ చేయడంతో పాటు, ప్రస్తుత మంత్రుల్లో ఇద్దరు, ముగ్గురికి ఉద్వాసన పలుకుతారని చెబుతున్నారు. మున్నూరు కాపు సామాజిక వర్గం నుంచి ఆది



శ్రీనివాస్‌ను మంత్రివర్గంలోకి తీసుకుంటారని, కుదరని పక్షంలో చీఫ్ విప్ పదవి ఇస్తారని ప్రచారం సాగుతోంది. ఏఐసీసీ హామీ ఇచ్చి తనను పార్టీలోకి చేర్చుకుందని చెబుతూ వస్తున్న రాజగోపాల్ రెడ్డికి మంత్రివర్గంలో బెర్త్ దక్కే అవకాశం కనిపిస్తోంది.

**ఎంపికపై అధిష్ఠానం కసరత్తు :**

లంబాడీల కోటా కింద మంత్రివర్గంలో చోటు కావాలని అధిష్ఠానం వద్ద ఈ సామాజిక వర్గం నేతలు పట్టుబడుతున్నారు. ప్రభుత్వ విప్‌గా ఉన్న రామచంద్రనాయక్, దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్‌లలో ఎవరో ఒకరిని కేబినెట్‌లోకి తీసుకునే అవకాశం కనిపిస్తోంది. బాలు నాయక్‌కు డిప్యూటీ స్పీకర్ పదవి ఇవ్వాలని భావించినా, ఆ జిల్లా నుంచి ఇద్దరు మంత్రులు ఉండటంతో రాజకీయ సమీకరణాలు కుదరలేదు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిలు కూడా మంత్రి పదవి కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. డిప్యూటీ స్పీకర్ కోసం కూడా ఎవరిని ఎంపిక చేయాలనే అంశంపై అధిష్ఠానం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

**మంత్రివర్గాన్ని మరింత పటిష్ఠ పరచాలని**

మంత్రివర్గ మార్పులు, చేర్పుల్లో ఉత్తర--దక్షిణ తెలంగాణ సమతుల్యతను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. మార్పులు, చేర్పుల ద్వారా మంత్రివర్గాన్ని మరింత పటిష్ఠ పరచాలని అధిష్ఠానం భావిస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి మాత్రం ప్రస్తుత మంత్రివర్గంతోనే ముందుకెళ్లడం ద్వారా అసంతృప్తి రాకుండా పాలనాపరంగా మరింత బలం చేకూరుతుందని సర్దిచెప్పే ప్రయత్నాలు చేస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

# ఇక పారిశ్రామిక ప్రగతి పరుగులే

**హైదరాబాద్ :** రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయి పారిశ్రామిక శక్తిగా తీర్చిదిద్దే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం 2026-27 బడ్జెట్‌లో పరిశ్రమలు , ఐటీ శాఖలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చింది. ఐటీ రంగానికి నిధులను పెంచుతూ రూ. 875 కోట్లు కేటాయించగా, పరిశ్రమల శాఖకు రూ. 3,490 కోట్లు ప్రతిపాదించింది. కేవలం హైదరాబాద్ పశ్చిమ ప్రాంతానికే పరిమితం కాకుండా, నగరం చుట్టూ ఐటీని విస్తరించేలా 'గ్రిడ్'విధానానికి ప్రభుత్వం పెద్దపీట వేసింది.

గ్లోబల్ హబ్ గా హైదరాబాద్: దేశంలోని మొత్తం గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లలో20% హైదరాబాద్‌లోనే ఉండటం విశేషం. గతేడాది కొత్తగా 70 జీసీసీలు ఇక్కడ కొలువుదీరాయి. గూగుల్ వంటి టెక్ దిగ్గజం తన 'సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్'ను ఇక్కడ నెలకొల్పడం గమనార్హం.

టీ-ఫైబర్ లక్ష్యం: ఇప్పటికే 8,888 గ్రామ పంచాయతీలు, 4,800 ప్రభుత్వ సంస్థలకు హై-స్పీడ్ ఇంటర్నెట్ అందించిన ప్రభుత్వం, ఈ ఏడాది చివరి నాటికి ఆ సంఖ్యను 50 వేలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది.ఎగుమతుల జోరు: రాష్ట్ర ఐటీ ఎగుమతులు రూ. 3.13 లక్షల కోట్లకు చేరాయి. వీటి ద్వారా 9.39 లక్షల మందికి పైగా ఉపాధి లభిస్తోంది. డేటా సెంటర్ ఆధునీకరణకు రూ. 100 కోట్లు కేటాయించారు.

పారిశ్రామిక ప్రగతి ? కొత్త హబ్‌లు:

కొడంగల్ ఇండస్ట్రియల్ పార్క్: పశ్చిమ తెలంగాణలోని కొడంగల్‌ను ప్రధాన పారిశ్రామిక కేంద్రంగా మార్చేందుకు 'మల్టీ పర్పస్ ఇండస్ట్రియల్ పార్క్'ను అభివృద్ధి చేయనున్నారు. రేడియల్ రోడ్-2 సమీపంలో దీనికోసం భూములను సమీకరిస్తున్నారు.

జహీరాబాద్ స్మార్ట్ సిటీ: కేంద్ర సహకారంతో 3,245 ఎకరాల్లో జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ప్రాజెక్టును వేగవంతం చేస్తున్నారు.జిల్లా కారిడార్లు: హైదరాబాద్ మినహా మిగిలిన 9 ఉమ్మడి జిల్లాల్లో కొత్త పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధికి రూ. 146.50 కోట్లు, గ్రామీణ చిన్నతరహా పరిశ్రమలకు రూ. 241.96 కోట్లు కేటాయించారు. హైదరాబాద్‌లో నిర్మిస్తున్న 'యూనిటీ మాల్' కోసం రూ. 173.16 కోట్లు ప్రతిపాదించారు.




ఎగుమతుల్లో రికార్డు వృద్ధి:

తెలంగాణ పారిశ్రామిక ఎగుమతులు గతేడాది కంటే 39.30% అద్భుత వృద్ధి సాధించి రూ. 1,61,843 కోట్లకు చేరాయి. దేశవ్యాప్త ఎగుమతుల్లో 4.37% వాటాతో తెలంగాణ 7వ స్థానంలో నిలిచింది. మన రాష్ట్రం నుంచి ప్రధానంగా అమెరికా (23.64%), యూఏఈ (11.74%) దేశాలకు ఔషధాలు, ఏరోస్పేస్, ఎలక్ట్రికల్ పరికరాలు ఎగుమతి అవుతున్నాయి.

**భవిష్యత్తు లక్ష్యాలు 2047 విజన్:**

డిఫెన్స్, ఏరోస్పేస్ హబ్: హైదరాబాద్‌ను దేశంలోనే అగ్రగామి ఏరోస్పేస్ హబ్‌గా నిలపాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దీనికోసం 1,500 ఎంఎస్ఎంఈలను (ఓూఓఇ) ఒకే గొడుగు కిందికి తీసుకురానుంది.

లైఫ్ సైన్సెస్ పాలసీ: 2026-30 నూతన లైఫ్ సైన్సెస్ విధానాన్ని తీసుకురావడంతో పాటు, జీనోమ్ వ్యాలీని మరో 300 ఎకరాలకు విస్తరించనున్నారు.

మహిళా పారిశ్రామికవేత్తలకు చేయూత: 119 నియోజకవర్గాల్లో మహిళా పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేకంగా 'ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్'లను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# వివాదాల కౌశిక్ రెడ్డి

**కరీంనగర్ :** వివాదాలే ఆయన జోలికి వస్తున్నాయో..లేక ఆయనే ఏరి కోరి మరీ కాంటవర్సీల్లో వేలు పెడుతున్నారో తెలియదు కానీ..నిత్యం ఏదో ఒక ఇష్యూతో హడావుడి చేస్తుంటారు హుజురాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి. కాంగ్రెస్‌లో ఉన్నప్పటి నుంచి ఆయన వ్యవహారశైలి దూకుడుగా ఉంటూనే వస్తోంది. ఆ తర్వాత బీఆర్ఎస్‌లోకి వచ్చి ఎమ్మెల్యే అయ్యాక అనవసర విషయాల జోలికి వెళ్లి పార్టీని రచ్చకీడుస్తున్నారన్న చర్చ ఉంది. గతంలో అప్పటి గవర్నర్ తమిళసై పై చేసిన వాఖ్యలు దుమారాన్ని రేపడంతో..ఆ తర్వాత నాలుక కరుచుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగులను బూతులు తిట్టారనే అలిగేషన్‌తో పాటు, బీజేపీ నేత ఈటల రాజేందర్‌పై ఏవో కామెంట్స్ చేసి రచ్చకు దారితీశారు.ఆ మధ్య జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌తో వాగ్వాదం కేసులో అరెస్ట్ అయి..చివరకు బెయిల్‌పై రిలీజ్ అయ్యారు. అరికెపూడి గాంధీని పరుష పదజాలంతో విమర్శించడంతో పోటాపోటీ ఫిర్యాదులకు, దాడులకు దారితీసింది. లేటెస్ట్‌గా తన నియోజకవర్గంలో సమ్మక్క సారలమ్మ జాతరలో రాద్దాంతం చేసి..రోడ్డుపై బైఠాయించి సీపీని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు కాంట్రవర్సీ అయ్యాయి. చివరకు ఐపీఎస్‌ల సంఘం డిమాండ్‌తో సారీ చెప్పాల్సి వచ్చింది. అప్పటి నుంచి కరీంనగర్ సీపీ గౌస్ ఆలంను టార్గెట్ చేస్తూ వస్తున్నారు కౌశిక్‌రెడ్డి. ఇదంతా ఆయన చేసిన రచ్చ, రాద్దాంతం అయితే..ఇప్పుడు సొంత పార్టీ నేతలే కౌశిక్‌రెడ్డి తీరుపై తిరుగుబావుట ఎగురవేస్తుండటం హాట్ టాపిక్‌గా మారింది.కౌశిక్ రెడ్డి తీరును నిరసిస్తూ హుజురాబాద్ బీఆర్ఎస్ నేతలు రహస్య సమావేశాలు ఏర్పాటు చేసుకోవడం హాట్ టాపిక్‌గా మారింది. ద్వితీయ శ్రేణి నాయకులను పట్టించుకోకపోవడం ఒక ఎత్తు అయితే, అధినేత దగ్గర తమను కనీసం పరిచయం కూడా చేయరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కౌశిక్‌రెడ్డి దూకుడుతో డ్యామేజ్ అవుతుందని..జమ్మికుంట మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు సమావేశం ఏర్పాటు చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. సీనియర్ లీడర్లపై కౌశిక్ వివక్ష చూపుతున్నారంటూ అసంతృప్త నేతలు గళం ఎత్తుతున్నారు.మున్సిపల్ ఎన్నికల్లో కౌశిక్ రెడ్డి తమకు అన్యాయం చేశారనేది వారి ప్రధాన ఆరోపణ. పార్టీ నిర్ణయాన్ని ధిక్కరించి పోటీ చేసిన వారికి, తనకు సాన్నిహిత్యంగా ఉండే వారికే కౌశిక్ మద్దతు తెలిపారని ఫైర్ అవుతున్నారు. హుజురాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ ఓటమికి కౌశిక్ రెడ్డి ఏకపక్ష నిర్ణయాలే కారణమని మండిపడుతోంది క్యాడర్. ఎప్పుడో ఓసారి హుజురాబాద్‌కు వచ్చి హడావిడి చేసి..ఆ తర్వాత తమను రోడ్డు మీద వదిలేసి వెళ్లిపోతారనేది కొందరు నాయకుల వాదన.వ్యక్తిగత ఎజెండాతో పాలిటిక్స్ చేస్తూ..ఏదో ఒక వివాదంలో తల దూరుస్తూ పార్టీని రచ్చకీడుస్తున్నాని కౌశిక్ వ్యతిరేకులు విమర్శిస్తున్నారు. క్యాడర్‌ను పట్టించుకోవడం లేదంటున్నారు. పొలిటికల్‌గా కౌశిక్ రెడ్డి దూకుడు పార్టీకి, ఆయనకు ఎంత మైలేజ్ తెచ్చి పెడుతుందో ఏమో గానీ..నెగిటివిటీనే ఎక్కువ అవుతుందన్న టాక్ ఉంది. బీఆర్ఎస్ ముఖ్యనేతలు కూడా కౌశిక్‌రెడ్డి తీరుపై గుసగుసలు పెట్టుకుంటున్నారట. ఆయన దూకుడు పార్టీకి ప్లస్ అవుతుందా? మైనస్ అవుతుందా? అనే దానిపై ఇంటర్నల్ డిస్కషన్ జరుగుతున్నట్లు టాక్. ఇప్పటికైనా కౌశిక్‌రెడ్డి తన తీరును మార్చుకుంటారో..ఎప్పటిలాగే దూకుడే ఎజెండాగా పెట్టుకుని వెళ్తారో చూడాలి.

## మూసీ అభివృద్ధిని ఆపేస్తాం అనకండి

-మొదటిపేజీ తరువాయి

ప్రతి కుటుంబంలో కార్లు పెరిగాయని, ట్రాఫిక్ రద్దీ పెరగడం వల్లే మెట్రో, ఎంఎంటీఎస్ విస్తరించుకున్నట్లు తెలిపారు. హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ బాగా పెరిగిందని, రాష్ట్రాన్ని మూడు ప్రాంతాలుగా విభజించి అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. క్యూర్, ప్యూర్, రేర్‌గా విభజించి ట్రాఫిక్ రద్దీ తగ్గేలా చూస్తున్నామన్న ఆయన, కాలుష్యం వెదజల్లే పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు తరలిస్తామన్నారు. రోడ్లను అండర్ పాస్‌లు, సర్ఫేస్, ఎలివేటెడ్ కారిడార్లుగా విభజించామని, ఎక్కడా ట్రాఫిక్ ఆగకూడదనేదే తమ ప్రధాన లక్ష్యమన్నారు.

**మెట్రోను మరో 76 కిలోమీటర్లు**

హైదరాబాద్‌లో మెట్రో విస్తరణకు ఎల్ అండ్ టీ కంపెనీ ముందుకు రాలేదన్న సీఎం, కేంద్ర ప్రభుత్వ నిబంధన వల్ల మెట్రోను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రూ.15 వేల కోట్లు కేటాయించి మెట్రోను స్వాధీనం చేసుకున్నామని, మెట్రోను మరో 76 కిలోమీటర్లు విస్తరించనున్నట్లు తెలిపారు. హైదరాబాద్ నగర శివార్ల నుంచి వచ్చే ఉద్యోగుల సంఖ్య బాగా పెరిగిందన్న ఆయన, మెట్రో విస్తరణపై కేంద్రం కూడా సానుకూలంగా స్పందించిందని పేర్కొన్నారు. శామీర్‌పేట, మేడ్చల్ వైపు ఎలివేటెడ్ కారిడార్లు నిర్మిస్తామని, దానికోసం కేంద్ర సంస్థలతో మాట్లాడి భూమి తీసుకుంటున్నట్లు ప్రకటించారు. పైన విమానాలు ఎగిరితే, కింద అండర్ టన్నెల్ వచ్చేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

**రోడ్ల విస్తరణకు ఇబ్బందులు**

జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ వంటి ప్రాంతాల్లో రోడ్ల విస్తరణకు ఇబ్బందులు ఉన్నాయని, వాహనాలు సిగ్నల్స్ వద్ద ఆగకుండా వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నట్లు రేవంత్ రెడ్డి తెలిపారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగిస్తున్నామని, అక్కడ ఉన్న చిరు వ్యాపారులకు ఇతర చోట్ల స్థలం కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్‌లో పలుచోట్ల మల్టీ లెవల్ కారు పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నామని, హిల్ట్ పాలసీ కింద పరిశ్రమలకు వినియోగ మార్పిడీ చేస్తున్నట్లు వెల్లడించారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుంటే దిల్లీ మాదిరిగా హైదరాబాద్‌లో కాలుష్యం పెరిగిపోతుందని చెప్పారు. ఓఆర్ఆర్ లోపల పలుచోట్ల రేడియల్ రోడ్లు వేస్తున్నట్లు పేర్కొన్నారు. దూరం తగ్గించేందుకు ఎలివేటెడ్ కారిడార్లు వేస్తున్నామన్న సీఎం, సిటీ మధ్య నుంచి అన్ని ప్రాంతాలకు వెళ్లేలా ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు. ఎలివేటెడ్ కారిడార్ల వల్ల హైదరాబాద్ అద్భుత నగరంగా మారుతుందని చెప్పారు. డ్రైనేజీ వ్యవస్థను మారిస్తే మూసీ సుందరీకరణ త్వరగా పూర్తవుతుందన్న ఆయన, ఫ్యూర్ రీజియన్‌లో పరిశ్రమలు ఉంటాయని, 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక ప్రణాళిక ప్రకారం ముందుకెళ్తున్నామని, క్యూర్‌లో సర్వీస్ సెక్టార్, ప్యూర్‌లో ఇండస్ట్రియల్ సెక్టార్, రేర్‌లో అగ్రికల్చర్ సెక్టార్‌లు వస్తాయన్నారు.

**అలా అనొద్దు ప్లీజ్**

ఆన్‌లైన్‌లోనే లెసెన్సులు రెన్యువల్ చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అభివృద్ధి విషయం వచ్చేసరికి అందరూ ఒక్కటి కావాలని సభ్యులకు సూచించారు. ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయాలు మాట్లాడదామని కోరారు. పరిపాలన అంతా ఒకే గొడుగు కిందకు తెచ్చామని చెప్పారు. మూసీ నది వల్ల నల్గొండ ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంచి సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరుతున్నట్లు సూచించిన రేవంత్,? పనులు చేయనివ్వం, ఆపేస్తాం, అని మాత్రం అనవద్దని కోరారు. అవసరమైతే మీ సూచనలు, సలహాల కోసం మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం, డిప్యూటీ సీఎం భట్టి సారథ్యంలో కమిటీ వేస్తామని తెలిపారు. "మన నగరం ఎదుర్కొంటున్న సమస్యలు ప్రధానంగా మానవ తప్పిదాలే. రవాణాలో రోడ్లు, రైల్వే, ఎయిర్ పోర్ట్ వంటివి కీలక పాత్ర పోషిస్తాయి. తెలంగాణను మూడు జోన్లుగా విభజించడం జరిగింది. క్యూర్, ప్యూర్, రేర్‌గా చేసుకున్నాం. అత్యధికంగా జనాభా వినియోగిస్తున్న మెట్రోను విస్తరించే దిశగా వెళ్తున్నాం"

## అది భస్మాసుర హస్తంగా మారింది

-మొదటిపేజీ తరువాయి

'కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రతి ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు రూ.12 వేలు ఇస్తామని బడ్జెట్‌లో చెబుతున్నారు. ఈ ప్రభుత్వం రూ.19 వేల కోట్ల రైతు బంధు ఎగ్గొట్టింది. రాష్ట్రమంతా రైతు రుణమాఫీ అమలు కాలేదు. రైతుల పాలిట అభయ హస్తం భస్మాసుర హస్తంగా మారింది. రైతు రుణమాఫీ కోసం అన్నదాతలు ఎదురుచూస్తున్నారు. ఏ నియోజక వర్గంలో చూసినా ఇదే పరిస్థితి నెలకొంది. రుణమాఫీ అమలు పూర్తయిపోయిందని ప్రభుత్వం చెబుతోంది. ఏ గ్రామం వెళ్లినా తమకు రుణమాఫీ కాలేదని రైతులు చెబుతున్నారు. ఆత్మహత్యలు ఆగాలని కేసీఆర్ రైతు బంధును ప్రవేశపెట్టారు. ఎన్ని విపత్తులు వచ్చినా రైతు బంధును కేసీఆర్ ఆపలేదు. మేము ఒక్క సీజన్ కూడా రైతు బంధును ఎగ్గొట్టలేదు. నాట్లు వేసే సమయంలో ఇవ్వాల్సిన రైతు భరోసాను కోతల సమయంలో ఇస్తున్నారు. మీరు ఎగ్గొట్టిన రైతు భరోసాను ఎప్పుడు ఇస్తారు? బడ్జెట్ ప్రతులను కాపీ పేస్ట్ చేస్తున్నారు. రాజీవ్ యువ వికాసం అంటూ గత బడ్జెట్ లో రూ.6వేల కోట్లు పెట్టారు.. ఒక్కరికీ ఇవ్వలేదు. గతసారి యువ వికాసం నిధులు ఎవరి జేబుల్లోకి వెళ్లాయి?' అని హరీష్ రావు అన్నారు.

## మండిపోతున్న మెట్రో ఛార్జీలు!

-మొదటిపేజీ తరువాయి



తగ్గిన ప్రయాణికుల సంఖ్య : ఛార్జీలు పెంచడంతో హైదరాబాద్ మెట్రోలో ప్రయాణికులు తగ్గారని అధికారుల కమిటీ ఇటీవలే ప్రకటించింది. గత సంవత్సరం ఛార్జీలను 20 నుంచి 30 శాతం వరకు పెంచిన విషయం తెలిసిందే. క్రితం ఆర్థిక సంవత్సరంలో రోజువారీ సగటు ప్రయాణికుల సంఖ్య 4.44 లక్షలు ఉన్నారు. హైదరాబాద్ మెట్రో ఛార్జీలు పెంచిన అనంతరం 4.28 లక్షలకు తగ్గినట్లు నివేదికలో వెల్లడించారు. 9 కి.మీ. దాటితే రూ.47 : హైదరాబాద్ నగరంలో ఆర్డినరీ బస్సులు, ఆటో కనిష్ఠ ఛార్జీ రూ.15తో పోలిస్తే మెట్రోనే చౌక అని అధికారులు అంటున్నారు. కనీస ఛార్జీ తక్కువే ఉన్నా కూడా 9 కి.మీ. దాటితే రూ.47 అవుతోందని, ఇది ఒకింత ప్రయాణికులకు భారమేనని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు ప్రైవేట్? నిర్వహణలో ఉన్న హైదరాబాద్ మెట్రో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అధీనంలోకి వచ్చాక ఛార్జీల పరంగా ఊరట కల్పించేలా నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని పలువురు అంటున్నారు.

**దేశంలోని వివిధ నగరాల్లో ఛార్జీల సవరణ ఇలా : -**

దేశంలో మెట్రో స్టేషన్ల నిర్వహణ, మౌలిక సదుపాయాల అభివృద్ధికి టికెట్ ధరలను సవరిస్తున్నాయి.

దిల్లీ మెట్రో గత సంవత్సరం కనీస ఛార్జీని రూ.10 నుంచి రూ.11కి, గరిష్ఠ ఛార్జీని రూ.60 నుంచి రూ.64కి పెంచారు. చాలా మెట్రోలతో పోలిస్తే ఇవి చాలా తక్కువ. ఛార్జీలు అందుబాటులో ఉండటంతో ప్రయాణికుల ఆదరణ పొందింది దిల్లీ మెట్రో.

హైదరాబాద్ మెట్రోలో గత సంవత్సరం కనీస ఛార్జీని రూ.10 నుంచి రూ.12కి, గరిష్ఠంగా రూ.60 నుంచి రూ.75కు పెంచింది. ప్రయాణికుల నుంచి వ్యతిరేకత వచ్చింది. దీంతో హైదరాబాద్ మెట్రో 10 శాతం రాయితీ అమలు చేస్తున్నారు. ఇప్పుడు కనిష్ఠ ఛార్జీ రూ.11 ఉండగా గరిష్ఠంగా రూ.69 వసూలు చేస్తున్నారు.

కర్ణాటక రాష్ట్ర రాజధాని బెంగళూరు మెట్రో ఈ సంవత్సరం గత నెలలో కనిష్ఠ ఛార్జీలు రూ.10 నుంచి రూ.11కు, గరిష్ఠంగా రూ.90 నుంచి రూ.95కి పెంచారు. పలు రాజకీయ కారణాలతో అమలు నిలిపివేసింది. ఇప్పుడు బెంగళూరు మెట్రో రూ.10 నుంచి రూ.90 మధ్య ఛార్జీలు ఉన్నాయి.

తమిళనాడు రాష్ట్ర రాజధాని చెన్నైలో రూ.10 నుంచి రూ.50 మధ్యలో ఉన్నాయి.


అత్యంత చౌకగా కోల్‌కతాలో రూ.5 నుంచి రూ.30 ఛార్జ్ చేస్తున్నారు.

## సంపాదకీయం

# ప్రపంచాన్ని వణికిస్తున్న చమురు మంటలు

ఇరాన్‌పై అమెరికా తీసుకున్న తాజా సైనిక–రాజకీయ చర్యలు, వాటి తర్వాత చోటుచేసుకున్న పరిణామాలు ప్రపంచ రాజకీయాల్లో ఒక కీలక మలుపును సూచిస్తున్నాయి. ప్రారంభ దశలో ఈ ఘర్షణను "త్వరగా ముగిసే పరిమిత యుద్ధం"గా భావించిన అమెరికా వ్యూహకర్తలు, ఇప్పుడు దీర్ఘకాలిక సంఘర్షణ, గ్లోబల్ ఆర్థిక ప్రభావాలు, మిత్ర దేశాలపై ఒత్తిడి వంటి అనేక సంక్లిష్టతలను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో "అమెరికా ఇరాన్‌ను తక్కువ అంచనా వేసిందా?" అనే ప్రశ్నకు సమాధానం కోసం పూర్వాపరాలు, వ్యూహాపరమైన అంచనాలు, ప్రస్తుత పరిస్థితులు అన్నీ విశ్లేషణకు వస్తాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం చేపట్టిన విధానం "శక్తి ప్రదర్శన ద్వారా వేగవంతమైన ఫలితం" అనే సిద్ధాంతంపై ఆధారపడి ఉంది. 2025లో ఇరాన్ అణు కేంద్రాలపై దాడులు, 2026లో వ్యూహాత్మక మౌలిక వసతులపై లక్ష్యబద్ధ దాడులు, మరియు "మ్యాక్సిమమ్ ప్రెషర్" విధానం? కలిసి ఇరాన్‌ను బలహీన పరచి త్వరగా వెనక్కి తగ్గిస్తుందని అమెరికా భావించింది. ట్రంప్ పలు సందర్భాల్లో ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని "తగ్గించాం, దాదాపు నిర్వీర్యం చేశాం" అని ప్రకటించడం కూడా ఈ అంచనాలకే సంకేతం. కానీ వాస్తవ పరిస్థితి పూర్తిగా భిన్నంగా మారింది. ఇరాన్ ప్రత్యక్ష యుద్ధానికి మాత్రమే కాకుండా అసమాన యుద్ధ వ్యూహాలకు ప్రసిద్ధి. హోర్ముజ్ జలసంధిని మూసివేయడం, గల్ఫ్ దేశాలపై పరోక్ష దాడులు, మిత్ర దేశాల ఆర్థిక వ్యవస్థలను లక్ష్యంగా చేసుకోవడం వంటి చర్యల ద్వారా అది ప్రతిస్పందించింది. ప్రపంచ చమురు సరఫరాలో సుమారు 20% ఈ మార్గం ద్వారా జరుగుతుండటంతో, ఈ మార్గం మూసివేత ప్రపంచ మార్కెట్లను కుదిపేసింది అమెరికా మొదట భావించిన కీలక అంచనా?ఇరాన్ నాయకత్వంపై దాడి చేస్తే దేశం వెనక్కి తగ్గుతుందన్నది. కానీ ఇరాన్ రాజకీయ వ్యవస్థ వ్యక్తి ఆధారితమైనది కాదు; అది సిద్ధాంత ఆధారిత వ్యవస్థ. ఖమేని వంటి నాయకుడిని లేదా సైనిక నాయకులను లక్ష్యంగా చేసుకున్నా, వ్యవస్థ కొనసాగుతుంది. అంతేకాక, ఇరాన్‌లో "బాహ్య శత్రువు" భావన ప్రజలను ఒకే జెండా కింద చేర్చే సామర్థ్యం కలిగి ఉంది. అందువల్ల నాయకత్వంపై దాడులు దేశాన్ని బలహీన పరచడంలో కంటే ప్రతిఘటనను పెంచే అవకాశమే ఎక్కువ. అమెరికా మరో పెద్ద పొరపాటు?ఈ ఘర్షణ కాల వ్యవధిపై చేసిన అంచనా. ప్రారంభంలో ఇది కొన్ని రోజులు లేదా వారాల్లో ముగిసే ఘర్షణగా భావించ బడింది. కానీ ఇది నాలుగు వారాలకు పైగా కొనసాగుతూ, మరింత తీవ్రతరమవుతోంది. విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, "త్వరగా ముగుస్తుంది" అన్న భావన ఇప్పుడు పూర్తిగా చెదిరి పోయింది. దీర్ఘకాలిక యుద్ధం వైపు పరిస్థితి మళ్లింది. చమురు ధరల విషయంలో కూడా అమెరికా అంచనాలు తప్పి పోయాయి. యుద్ధం ప్రారంభానికి ముందు బ్యారెల్‌కు సుమారు ?70 ఉన్న చమురు ధరలు, ఇప్పుడు ?100?113 స్థాయికి చేరుకున్నాయి. ఇది కేవలం ఇంధన రంగానికే పరిమితం కాకుండా, ప్రపంచ వ్యాప్తంగా ద్రవ్యోల్బణం, ఉత్పత్తి ఖర్చులు, రవాణా ఖర్చులు పెరగడానికి దారితీసింది. ఈ సంక్షోభం 1970ల ఎనర్జీ షాక్‌లను తలపించే స్థాయికి చేరే ప్రమాదం ఉంది. అమెరికా వ్యూహకర్తలు దీర్ఘకాలంలో చమురు ధరలు తగ్గుతాయని కూడా భావించారు. ఇరాన్ ప్రభావాన్ని తగ్గిస్తే "టెరర్ ప్రీమియం" తగ్గి ధరలు పడిపోతాయని వాదనలు వినిపించాయి. కానీ తక్షణ ప్రభావం పూర్తిగా వ్యతిరేకంగా వచ్చింది?మార్కెట్లలో అనిశ్చితి పెరిగి ధరలు మరింత పెరిగాయి. మిత్ర దేశాల అంశంలో కూడా అమెరికా వ్యూహం చిక్కుల్లో పడింది. యూరప్ వంటి దేశాలు ఇంధన దిగుమతులపై ఎక్కువగా ఆధార పడటంతో, ఈ సంక్షోభం వారికి తీవ్రమైన ఆర్థిక ఒత్తిడిని తెచ్చింది. గ్యాస్ ధరలు రెట్టింపు కావడం, పరిశ్రమలపై ప్రభావం, వ్యవసాయ రంగంలో ఇన్‌పుట్ ఖర్చుల పెరుగుదల?కలిసి ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కుదిపేస్తున్నాయి. అమెరికా మిత్ర దేశాలకు మరో సమస్య భద్రతా పరమైనది. ఇరాన్ స్పష్టంగా హెచ్చరించింది?అమెరికా మద్దతు ఇచ్చే దేశాలపై కూడా దాడులు చేస్తామని. గల్ఫ్ ప్రాంతంలో ఉన్న అమెరికా సైనిక స్థావరాలు, ఆయిల్ సదుపాయాలు లక్ష్యంగా మారే అవకాశం ఉంది. దీని వల్ల మిత్ర దేశాలు "అమెరికా నిర్ణయాల భారం" మోయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక ఆర్థికంగా కూడా అమెరికా తానే ఒత్తిడిని ఎదుర్కొంటోంది. పెట్రోల్ ధరలు పెరగడం, స్టాక్ మార్కెట్లలో అనిశ్చితి, వడ్డీ రేట్లపై ఒత్తిడి? కలిసి దేశీయ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయి. అంతేకాక, దీర్ఘకాల యుద్ధం జరిగితే అమెరికా సైనిక ఖర్చులు కూడా పెరిగే అవకాశం ఉంది. ఇరాన్‌ను తక్కువ అంచనా వేసిన అంశం ఇక్కడ స్పష్టమవుతుంది. ఇరాన్ కేవలం ఒక దేశం మాత్రమే కాదు; అది ఒక ప్రాంతీయ ప్రభావ వ్యవస్థ. హిజ్బుల్లా, హూతీలు, షియా మిలీషియాలు వంటి మిత్ర బలగాల ద్వారా పరోక్ష యుద్ధాన్ని కొనసాగించే సామర్థ్యం ఉంది. ఈ "మల్టీ–లేయర్డ్ వార్ స్ట్రాటజీ"ను అమెరికా పూర్తిగా అంచనా వేయలేక పోయింది. ట్రంప్ ప్రభుత్వం మూడు ప్రధాన అంచనాల్లో పొరపాటు చేసింది. మొదటిది?త్వరగా ముగిసే యుద్ధం అనే అంచనా. రెండవదినాయకత్వంపై దాడి చేస్తే ఇరాన్ వెనక్కి తగ్గుతుందనే భావన. మూడవది?చమురు ధరలు మరియు గ్లోబల్ మార్కెట్లపై ప్రభావాన్ని తక్కువగా అంచనా వేయడం. ప్రస్తుత పరిస్థితి చూస్తే, ఇది పరిమిత యుద్ధం నుండి విస్తృత ప్రాంతీయ ఘర్షణగా మారే ప్రమాదం కనిపిస్తోంది. హోర్ముజ్ జలసంధి సమస్య పరిష్కారం కాకపోతే, చమురు సరఫరా మరింత క్షీణించి, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్రమైన ప్రభావం చూపే అవకాశముంది.అందువల్ల "అమెరికా ఇరాన్‌ను తక్కువ అంచనా వేసిందా?" అనే ప్రశ్నకు సమాధానం?అవును, వ్యూహాత్మకంగా కొన్ని కీలక అంశాల్లో తక్కువ అంచనా వేసింది అని చెప్పాలి. అయితే ఈ ఘర్షణ ఇంకా ముగియలేదు; తదుపరి పరిణామాలు అమెరికా వ్యూహం ఎంతవరకు మారుతుందో, ప్రపంచ శక్తి సమీకరణాలు ఎలా మారుతాయో నిర్ణయిస్తాయి.

# క్షయపై ఉన్న అపోహలను పారద్రోలాలి



ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం ప్రతి సంవత్సరం మార్చి 24 న నిర్వహిస్తారు. భయంకర మైన అంటు వ్యాధైన టీబీ (క్షయ) దేశంలో ప్రతి సెకనుకు ఒక్కరికి సోకుతున్నదని, ప్రతిరోజు 1000 మంది క్షయ వ్యాధితో మరణిస్తున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. భారత ప్రభుత్వం 1962 నుండి క్షయవ్యాధి నివారణకు ప్రత్యేకమైన చర్యలను తీసుకోవడం ప్రారంభించింది. 1882, మార్చి 24న డా. రాబర్ట్ కోచ్ అనే శాస్త్రవేత్త క్షయ వ్యాధికారక సూక్ష్మ క్రిములను (మైకోబ్యాక్టీరియమ్ టూబరిక్లోసిస్) మొదటి సారిగా కనుగొన్నాడు. 1982లో అంతర్జాతీయ క్షయ, ఊపిరితిత్తుల వ్యాధుల వ్యతిరేక యూనియన్, రాబర్ట్ కోచ్ క్షయ వ్యాధికారక సూక్ష్మక్రిములను కనుగొని 120 సంవత్సరాలు కావస్తున్నాయి. ఐరోపాలో క్షయ బ్యాక్టీరియా 7 వేల ఏళ్ల క్రితమే మనుగడ సాగించినట్లు, అత్యంత ప్రాచీన క్షయ కేసు 7వేల ఏళ్ళ క్రితమే ఉన్నట్లు స్జెగెడ్ విశ్వ విద్యాలయానికి చెందిన పరిశోధకులు మురియెల్ మాసన్ పరిశోధనలో వెల్లడైంది. హైపర్ ట్రోఫిక్ పల్మనరీ ఆస్టియోపతి (హెచ్‌పీవో) అనే వ్యాధికి వేల సంవత్సరాల క్రితం క్షయ కారణమనీ, పురావస్తు రికార్డుల్లో నమోదైన వివరాల ప్రకారం గుర్తించారు. ఈ అధ్యయనంలో భాగంగా పరిశోధకులు దక్షిణ హంగరీలో ఏడువేల సంవత్సరాల క్రితంనాటి ప్రదేశంలో 71 మానవ అస్థిపంజరాలను పరీక్షించారు. వీటి ఆధారంగా ఇన్ఫెక్షన్లు, జీవక్రియ సంబంధ వ్యాధులకు సంబంధించి పలు కేసులను గుర్తించారు. కొన్ని అస్థిపంజరాల్లో హెచ్‌పీవోకు సంబంధించిన సంకేతాలు కూడా గుర్తించడంతో క్షయ అప్పట్లోనే ఉన్నట్లు భావిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) గణాంకాల ప్రకారం ప్రపంచంలో మూడొంతుల మంది క్షయ వ్యాధిగ్రస్తులు భారతదేశంలోనే ఉన్నారు. టీబీ కారణంగా ఇండియాలో ఏటా 4,80,000 మరణాలు సంభవిస్తున్నాయి. భారత ప్రభుత్వ గణాంకాల ప్రకారం క్షయ కారణంగా దేశంలో రోజుకి 1,300 మంది చనిపోతున్నారు. గత 50 ఏళ్లుగా టీబీని నివారించేందుకు ఇండియా పోరాటం చేస్తున్నప్పటికీ అది అంతం కావడం లేదు. అందుకే ఇప్పటికీ దీన్ని 'సైలెంట్ కిల్లర్' అని పిలుస్తున్నారు. క్షయ అనగానే దగ్గు గుర్తుకు రావడం సహజం, తద్వారా కేవలం ఊపిరి తిత్తులకు మాత్రమే క్షయ వ్యాధి కలుగుతుందని అనేకమంది భావిస్తుంటారు. కానీ క్షయ వ్యాధి అనేది, శరీరంలో ఏ భాగానికైనా రావొచ్చు. చర్మం, గర్భాశయం మొదలైనవి. అదే విధంగా మెదడుకు కూడా క్షయవ్యాధి సోకుతుంది. తద్వారా మెదడులోని రక్తనాళాలు వాపునకు గురవడం జరుగుతుంది. దీనిని మెనింజైటిస్ క్షయ వ్యాధిగా కూడా పిలుస్తారు.క్షయ రోగాన్ని ఒకప్పుడు ప్రాణాంతకమైన వ్యాధిగా పరిగణించే వారు. కానీ క్రమేపీ దాన్ని నిరోధించటం, నివారించటం మొదలైంది. మైకో బాక్టీరియం క్షయ అనే బ్యాక్టీరియా వల్ల క్షయవ్యాధి వస్తుంది. ఇది సాధారణంగా ఊపిరితిత్తులను ప్రభావితం చేస్తుంది. అయితే ఇది శరీరంలోని ఏదైనా అవయవానికి కలిగి ఉంటుంది. క్షయ అనేది నయం చేయగల మరియు నివారించగల వ్యాధి. ఊపిరితిత్తుల టిబి దగ్గు, తుమ్ము లేదా బిందువుల ద్వారా ఉమ్మివేసినప్పుడు ఇది వ్యక్తి నుండి వ్యక్తికి గాలి ద్వారా వ్యాపిస్తుంది. టిబి ఉన్న వ్యక్తి దగ్గు, నిరీక్షణ, హిమోప్టిసిస్, జ్వరం, రాత్రి చెమటలు, ఆకలి లేకపోవడం లేదా 2 వారాల కన్నా ఎక్కువ బరువు తగ్గడం వంటి లక్షణాలను కలిగి ఉంటుంది. క్షయవ్యాధి నిర్ధారణ మరియు చికిత్స పూర్తిగా ఉచితం మరియు జాతీయ టిబి ఎలిమినేషన్ ప్రోగ్రామర్ (ఎన్‌టిఇపి) చేత సమన్వయం చేయబడుతుంది. మెదడు క్షయ వ్యాధి కారకాలు ప్రధానసీగా...ఎక్కువ మద్యం సేవించడం, ఎయిడ్స్, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండడం, డయాబెటిస్ మెల్లిటస్ (రక్తంలో చక్కర నిల్వలు అమాంతం పెరిగి పోవడం, ఇన్సులిన్ స్థాయిలు హీనంగా తగ్గిపోవడం) తదితరాలు కారకాలుగా ఉంటాయి.సాధారణంగా ఎక్స్–రే, గళ్ళ పరీక్షలతో 60% నుంచి 70 శాతం కేసుల్లో టి.బి అని నిర్ధారించవచ్చు. వీటితో నిర్ధారణ కాకపోతే అప్పుడు సెరోలజీ, పీసీఆర్, మాంలో వంట్ పరీక్షలు చేయించాల్సి ఉంటుంది. ఇవేగాక అవసరాన్ని బట్టి సీటీస్కాన్, టోన్స్కాన్, బయాప్సీ వంటి పరీక్షలు చేయించాలి. మెదడు క్షయ వ్యాధిని తగ్గించుకునే చికిత్సలో ప్రధాన భాగం ఆహార ప్రణాళికలలో మార్పులు చేయడమే. శరీరంలో రోగ నిరోధక శక్తి తత్వాలు పెరిగే కొలదీ, రోగాన్ని ఎదుర్కొనే శక్తిని శరీరనీ పొందగలదు. కావున ఈ వ్యాధికి గురైన వారు తమ ఆహార ప్రణాళికలో తాజా పండ్లు, కాయగూరలు, మరియు ఆరోగ్యకర ప్రోటీన్ నిల్వలు ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలు డైటీషియన్ సలహా మేరకు తీసుకొనవలసి ఉంటుంది. తద్వారా త్వరగా కోలుకునే అవకాశనీ ఉన్నది. మెనింజెటిస్ క్షయ వ్యాధి సమస్యలు అత్యంత జఠిలనీ గా ఉంటాయి. కొన్ని సందర్భాలలో ప్రాణాంతకం కూడా కావొచ్చు. చికిత్సా సమయంలో ముఖ్యంగా పండ్లనే ఎక్కువ తీసుకొనవలసి ఉంటుంది. చికిత్స పూర్తయిన తర్వాత డాక్టర్ సలహా మేరకు పాలను కూడా తీసుకొనవచ్చు.పాలలో అత్యధిక మోతాదులో కాల్షియం నిల్వలు ఉంటాయి, కావున మెదడు క్షయ వ్యాధికి గురైన వారికి మంచి ఆహారంగా సూచించ బడుతుంది. క్షయ వ్యాధి ఉన్న రోగి దగ్గినప్పుడు క్షయ క్రిములు గాలి ద్వారా వ్యాపిస్తాయి. క్షయ వ్యాధి గ్రస్తుడు దగ్గినపుడు, అతని ఊపిరితిత్తుల నుండి వచ్చే కఫం ద్వారా ఈ బాక్టీరియా గాలిలో చేరి, దగ్గరలో ఉన్న ఆరోగ్యవంతమైన మనిషి పీల్చే గాలితోపాటు అతని ఊపిరితిత్తుల లోనికి ప్రవేశించి జబ్బుకు పునాది వేస్తుంది. కనుక వ్యక్తిగత శుభ్రత, పరిసరాల శుభ్రత, ఇళ్లలో గాలి, వెలుతురు మొదలైనవి బాగా ఉండేలా చూసుకోవాలి. దగ్గినప్పుడు, తుమ్మిన ప్పుడు చేతి రుమాలు అడ్డంగా పెట్టుకోవాలి. ఎక్కడపడితే అక్కడ ఉమ్మేయ కూడదు. ఉమ్మి వేయడానికి మూత ఉన్న కప్పు ఉప యోగించాలి. మంచి పోషకాహారం తీసుకుని వ్యాధి నిరోధక శక్తిని పెంపొందింప జేసుకోవాలి. 2025 నాటికి టిబిని అరికట్టడం లక్ష్యంగా చికిత్స మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించడం ద్వారా మంచి ఫలితాలను సాధించవచ్చు. దీర్ఘకాలిక సీక్వెల్ ప్రారంభ రోగ నిర్ధారణ మరియు చికిత్స ద్వారా నివారించవచ్చు. క్షయవ్యాధి చికిత్స, వైద్య సేవలు, ప్రాథమిక ఆరోగ్య కార్యక్రమాలలో భాగంగా ఆరోగ్య కేంద్రాలలోనే అందు బాటులో ఉన్నాయి. ప్రస్తుతం రివైజ్డ్ టి.బి. కంట్రోలు ప్రోగ్రాంను ప్రభుత్వం అమలు పరుస్తోంది. క్రమం తప్పకుండా పూర్తి మోతాదులో మందులు వేసుకున్నట్టయితే క్షయ వ్యాధిని పూర్తిగా నయం చేసు కోవచ్చు. క్షయరోగి క్రమం తప్పకుండా, ఆపకుండా కనీసం ఆరునెలలపాటు మందులు వేసుకొనవలసి ఉంటుంది. కొంతమంది రోగులకు ఒక సంవత్సరం పాటు మందులు ఇవ్వవలసి ఉంటుంది. వైద్యులను సంప్రదించిన తరువాతనే వారి సలహా మేరకు మాత్రమే మందులు వేసుకొనడం ఆపివేయాలి.

# జగదీశ్వర్ గానయాత్రకు నంది గౌరవం



జగదీశ్వర్‌కు స్వర్ణ నంది పురస్కారం లభించడం తెలుగు గాన ప్రపంచానికి గర్వకారణమైన ఘట్టంగా నిలిచింది. గాత్రంలో గంభీరత, స్వరంలో సౌందర్యం, భావ ప్రకటనలో ఆవేశం?ఈ మూడు లక్షణాల సమన్వయంతో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్న గాయకుల్లో డా. గుండి జగదీశ్వర్ శర్మ ఒక విశిష్ట ప్రతిభ. తెలంగాణ భూమిలోని ఆధ్యాత్మిక క్షేత్రాల వైభవాన్ని తన గాత్రంలో మలచి, భక్తి, జానపదం, శాస్త్రీయతల సమ్మేళనంతో గానయాత్ర సాగిస్తున్న ఆయనకు లభించిన ఈ గౌరవం కేవలం వ్యక్తిగత విజయమే కాకుండా తెలుగు సంగీత సంప్రదాయానికి లభించిన మరొక గౌరవంగా చెప్పుకోవాలి.పవిత్ర గోదావరి నది తీరాన వెలసిన ధర్మపురి క్షేత్రం, దక్షిణ కాశీగా, నవనరసింహ క్షేత్రాలలో ఒకటిగా ప్రసిద్ధి పొందిన ఆధ్యాత్మిక ప్రదేశం. హరిహరులు, బ్రహ్మతో కూడిన త్రిమూర్తుల క్షేత్రంగా ఖ్యాతి గాంచిన ఈ ప్రాంతంలో గుండి హరిప్రియ, హన్మాండ్లు దంపతులకు జన్మించిన జగదీశ్వర్ శర్మ బాల్యంలోనే సంగీతం పట్ల సహజమైన ఆకర్షణను ప్రదర్శించారు. భక్తి వాతావరణంలో పెరిగిన ఆయనకు స్వరాలంటే పూజా విధానంలా మారింది. చిన్ననాటి నుంచే సాధనను జీవిత భాగంగా చేసుకొని, గురువుల మార్గదర్శకత్వంలో స్వర సాధనను క్రమబద్ధంగా అభ్యసిస్తూ, తన గాత్రాన్ని మెరుగు పరచుకున్నారు. ఈ క్రమశిక్షణే ఆయనను గాత్ర సరస్వతిగా తీర్చిదిద్దింది. సంగీత రంగంలో అడుగుపెట్టిన ప్రారంభ దశల నుంచే ఆయన ప్రతిభ ప్రస్ఫుటమైంది. రేడియో, టెలివిజన్ వంటి మాధ్యమాల ద్వారా తన గాత్రాన్ని ప్రజలకు పరిచయం చేస్తూ, తెలుగు గాన ప్రపంచంలో తన ప్రత్యేక గుర్తింపును స్థిరపరచు కున్నారు. ముఖ్యంగా ఈటీవీలో ప్రసారమైన 'పాడుతా తీయగా' కార్యక్రమంలో పాల్గొనడం ఆయన జీవితంలో కీలకమలుపుగా నిలిచింది. గానగంధర్వుడు ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం సమక్షంలో తన గాత్రాన్ని ప్రదర్శించడం ద్వారా ఆయన ప్రతిభకు విశేషమైన గుర్తింపు లభించింది. అదే విధంగా జెమినీ టీవీలోని 'నవరాగం' సంగీత పోటీలో సెమీఫైనల్ వరకు చేరుకోవడం ద్వారా, ప్రముఖ గాయకుల ప్రశంసలు పొందిన తొలి తెలంగాణ గాయకుడిగా గుర్తింపు సంపాదించారు. అయితే ఆయన ప్రయాణం టెలివిజన్ కార్యక్రమాలతో మాత్రమే పరిమితం కాలేదు. సంగీత దర్శకులు కోటి, మాధవపెద్ది సురేష్, ఆర్. పి. పాట్నాయక్ వంటి ప్రముఖులతో కలిసి ఆర్కెస్ట్రా ప్రదర్శనల్లో పాల్గొని, వారి ప్రశంసలను అందుకున్నారు. ఈ అనుభవం ఆయన గాన శైలిలో మరింత నైపుణ్యాన్ని, వైవిధ్యాన్ని తీసుకొచ్చింది. ఇప్పటి వరకు 1600కు పైగా సంగీత విభావరులను నిర్వహించడం ఆయనకు ఒక అరుదైన ఘనత. ఈ కార్యక్రమాలు తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ విస్తరించి, ఆయన గాత్రాన్ని విభిన్న వేదికలపై వినిపించాయి. ప్రతి ప్రదర్శనలోనూ శ్రోతల హృదయాలను హత్తుకునే గాత్రమాధుర్యం ఆయన ప్రత్యేకతగా నిలిచింది. జగదీశ్వర్ శర్మ గాన ప్రస్థానానికి లభించిన అవార్డులు ఆయన ప్రతిభకు నిదర్శనం. ఇప్పటి వరకు 130కి పైగా అవార్డులు అందుకోవడం ద్వారా ఆయన తన స్థానాన్ని మరింత బలపరచు కున్నారు. ముఖ్యంగా ఎస్. పి. బాలసుబ్రహ్మణ్యం పేరుతో మూడు సార్లు, ఘంటసాల పేరుతో రెండు సార్లు అవార్డులు పొందడం ఆయన గాన ప్రతిభకు అద్దం పడుతుంది. తెలంగాణ రత్న, ప్రతిభా రత్న వంటి బహుమతులు ఆయనకు లభించడం ఆయనకు ఉన్న ప్రజాదరణను తెలియ జేస్తుంది. నార్త్ ఢిల్లీ కల్చరల్ అకాడమీ నుంచి జాతీయ స్థాయిలో 'బెస్ట్ సింగర్'గా అవార్డు పొందడం ఆయన గానానికి దేశవ్యాప్తంగా లభించిన గుర్తింపు. అంతేకాకుండా, అంతర్జాతీయ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, జీనియస్ బుక్ ఆఫ్ ఇంటర్నేషనల్ రికార్డ్స్‌లలో 'బెస్ట్ సింగర్'గా స్థానం పొందడం ఆయన ప్రతిభకు అంతర్జాతీయ స్థాయిలోనూ గుర్తింపు తీసుకొచ్చింది.2021లో ఢిల్లీ విశ్వవిద్యాలయం ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేయడం ఆయన గానసేవకు లభించిన అత్యున్నత గౌరవాల్లో ఒకటి. అప్పటి భారత ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా ఈ డాక్టరేట్ అందుకోవడం ఆయన జీవితంలో మరుపురాని ఘట్టంగా నిలిచింది. ఇది ఆయన వ్యక్తిగత విజయమే కాకుండా తెలంగాణ గాన సంప్రదాయానికి లభించిన గౌరవంగా చెప్పుకోవచ్చు.భక్తి, ఆధ్యాత్మికత, జానపద సంప్రదాయాల మేళవింపుతో ఆయన గానయాత్ర కొనసాగుతోంది. 100కు పైగా ఆడియో సీడీలలో పాల్గొని, వినాయక భక్తి గీతాలు, శ్రీరామ భజనలు, ఆంజనేయ స్తోత్రాలు, జానపద గీతాలు వంటి అనేక గాన రూపాలను ప్రజలకు అందించారు. ముఖ్యంగా ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి శతకాలకు ఆయన గాత్రం అందించడం ద్వారా ఆధ్యాత్మిక గానానికి కొత్త పరిమాణాన్ని ఇచ్చారు. ప్రతి గానంలోనూ భక్తి భావాన్ని ప్రతిబింబింపజేసే ఆయన గాత్రం శ్రోతలకు ఆత్మీయ అనుభూతిని కలిగిస్తుంది. సంగీతాన్ని ఆయన కేవలం వృత్తిగా కాకుండా జీవనపథంగా భావించడం ఆయన ప్రత్యేకత. ప్రతి పాటను పూజార్చనగా భావిస్తూ, శ్రద్ధతో, భక్తితో ఆలపించడం ఆయన గానశైలిలో స్పష్టంగా కనిపిస్తుంది. ఈ విధానం ఆయనను సాధారణ గాయకుడిగా కాకుండా ఆధ్యాత్మిక గాయకుడిగా నిలబెట్టింది. భక్తి, సామాజిక చైతన్యం, సంగీత వైవిధ్యాల సమ్మేళనంతో ఆయన గాన ప్రస్థానం ఒక ఆదర్శంగా నిలుస్తోంది.ఇటీవల శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా హైదరాబాద్‌లోని త్యాగరాయ గాన సభలో స్వర మాధురి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు స్వర్ణ నంది ఉగాది పురస్కారం ప్రదానం చేయడం విశేషం. వంశీ ఇంటర్నేషనల్ అధినేత వంశీ రామరాజు, దైవజ్ఞ శర్మ, ఆస్ట్రేలియాలోని వ్యాపారి శేషు చేతుల మీదుగా ఈ అవార్డు అందుకోవడం ఆయన గాన ప్రస్థానంలో మరో మైలురాయిగా నిలిచింది. 28 సంవత్సరాల సంగీత ప్రయాణంలో ఇది ఆయనకు లభించిన మూడవ బంగారు నంది పురస్కారం కావడం ప్రత్యేకత. ఈ అవార్డుతో కలిపి ఆయన అందుకున్న మొత్తం అవార్డుల సంఖ్య 135కు చేరుకోవడం ఆయన సాధనకు ప్రతీకగా నిలుస్తోంది. జగదీశ్వర్ శర్మ గాన ప్రస్థానం కేవలం వ్యక్తిగత విజయాల సమాహారం మాత్రమే కాదు; అది ఒక సంస్కృతి, ఒక సంప్రదాయం, ఒక ఆధ్యాత్మిక ప్రయాణం. ఆయన గాత్రం ద్వారా భక్తి పరంపర కొనసాగుతూనే ఉంది. భవిష్యత్ తరాలకు ఆయన ఒక ప్రేరణగా నిలుస్తున్నారు. సాధన, పట్టుదల, వినయం?ఈ మూడు గుణాలు కలిసినపుడే గొప్పతనం సాధ్యమవుతుందని ఆయన జీవితమే స్పష్టంగా చెబుతోంది. తెలుగు గాన ప్రపంచంలో ఆయన స్థానం మరింత ఎత్తుకు ఎదగాలని, ఆయన గాత్రం మరిన్ని హృదయాలను హత్తాలని ఆకాంక్షించాలి.

# సమాజానికి గ్రంధాలయాలు ఎంతో అవసరం

అంబేద్కరిస్ట్ జేబీ రాజు

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

నేటి సమాజానికి గ్రంథాలయాలు ఎంతో అవసరమని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అంబేద్కరిస్ట్ జేబీ రాజు అన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణ కేంద్రంలో పూలే అంబేద్కర్ జ్ఞాన గ్రంథాలయం వ్యవస్థాపకులు జి. సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథులుగా హాజరైనారు. సందర్భంగా జరిగిన సమావేశంలో జె బి రాజు మాట్లాడుతూ గ్రంథాలయాల ద్వారా భవిష్యత్ తరాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, దళిత బహుజనుల ఐక్యత కోసం జ్ఞాన గ్రంథాలయాలు ఎంతో దోహదపడుతాయన్నారు. ప్రతి ఒక్కరు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చరిత్రతో పాటు మహనీయుల చరిత్రలను చదువుకొని వారి బాటలలో ముందుకెళ్లి చైతన్యవంతం కావాలని ఆయన అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పేద దళిత వర్గాల ప్రజల మేలు కోసం బ్రిటిష్ వారితో సైతం పోరాడి హక్కులు, రిజర్వేషన్లు, సాధించడం వల్లనే నేడు దళిత బహుజనులు సమాజంలో గుర్తింపు పొందుతున్నారన్నారు. అంబేద్కర్ రిజర్వేషన్ ద్వారా ఫలితాలు అనుభవించి, తమ తోటి కులస్తులను నేడు మరుస్తున్నారని, అంబేద్కర్ రిజర్వేషన్ ద్వారా లబ్ధి పొంది తమ



కులాలకు, సొసైటీకి అందించాలని సూచించారని ఆయన ఏ ఒక్క ఉద్యోగస్తులు లబ్ధి పొందిన వారు తమ సొసైటీ గురించి ఆలోచింపడం లేదని ఆయన విమర్శించారు. అంతకుముందు భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబేద్కర్ రిస్టు జేబీ రాజు, పూలే అంబేద్కర్ జ్ఞాన గ్రంథాలయం వ్యవస్థాపకులు జి సుధాకర్, కల్వకుర్తి తాలూకా జేఏసీ చైర్మన్ సదానందం గౌడ్, అంబేద్కర్ వాది రాములు, కౌన్సిలర్ రామకృష్ణ, బంగారి, కురుమూర్తి రాధాకృష్ణ జర్నలిస్ట్ నాయకులు దరువుల శంకర్ , బాలయ్య బిక్షపతి రమణ, యామిని, బొజ్జన్న, తోపాటు తదితరులు పాల్గొన్నారు.

# ఫీల్డ్ అసిస్టెంట్ పై ఫిర్యాదు

**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి//** సుల్తానాబాద్ రూరల్ పెద్దపల్లి జిల్లా పెద్దపల్లి మండలం సబితం గ్రామపంచాయతీ మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ ఈ రమేష్ గ్రామంలో ఉపాధి హామీ పథకంలో అనేక అవకతవకలకు పాలు పడుతున్నాడు అంటూ పనిచేయని వారికి హాజరు వేస్తూ సగం సగం కూలీల సొమ్మును తీసుకుంటున్నట్లు ఆరోపిస్తూ అదే గ్రామానికి చెందిన, గుమ్మడి మారుతి సోమవారం పెద్దపల్లి జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కాళీశీదిని కి ఫిర్యాదు చేశాడు. తన ఫిర్యాదులో ఫీల్డ్ అసిస్టెంట్ ఉపాధి హామీ పథకంలో అనేక అక్రమాలకు తెర లేపాడని పేర్కొన్నాడు. పథకం నిబంధనలకు విరుద్ధంగా కూలీలతో పనిచేపిస్తూ, నిధులను దుర్వినియోగ పరుస్తూ ప్రభుత్వ సొమ్మును పక్కదారి పట్టిస్తున్నాడంట ఆరోపించాడు. ఉపాధి హామీ కూలీలను గ్రామంలో జరిగే ఒక కాంట్రాక్ట్ పనిలో ఉపాధి కూలీలతో పని చేయిస్తూ సొమ్ము చేసుకుంటు ఉపాధి హామీ ఆశయానికి గండి కొడుతున్నాడంటూ ఫిర్యాదు చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్ పైన సమగ్ర విచారణ చేపట్టి శాఖ పరమైన చర్యలు చేపట్టాలని ఫిర్యాదులు పేర్కొన్నాడు.

# సర్పంచ్ లా సంఘం అధ్యక్షులుగా శేఖర్ యాదవ్



సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

తలకొండపల్లి మండల కేంద్రం లో నూతనగా ఎన్నికైన సర్పంచ్ లందరు కలిసి తలకొండపల్లి గ్రామ సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్ ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ కటికలశేఖర్ యాదవ్ మాట్లాడుతూ నాపైన నమ్మకం తో నన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్న అన్ని గ్రామాల సర్పంచులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ సర్పంచ్ లందరికి ఎల్లపుడు అందుబాటులో ఉండి అందరికీ సహకరిస్తారని తెలిపారు.

# ఎత్తు పెరిగింది.. గింజల్లేవ్!

**నాసిరకం మొక్కజొన్న విత్తనాలతో నిండా మునిగిన రైతులు**

**వల్లాపురంలో సుమారు వంద ఎకరాల్లో పంట నష్టం**

**ఎకరాకు 40 క్వింటాళ్లకు బదులు 10 క్వింటాళ్ల దిగుబడే..**

**ముదిగొండ :** నాసిరకం మొక్కజొన్న విత్తనాలతో వల్లాపురం గ్రామంలో సుమారు సుమారు 20 మంది రైతులు వంద ఎకరాల్లో పంట నష్టపోయారు. పంట ఎత్తుగా పెరిగింది.. కానీ కంకులు చిన్న సైజ్‌లోనే ఉన్నాయి. కొన్ని కంకులైతే సరిగా గింజలు కూడా రాలేదు. ఎకరాకు 40 క్వింటాళ్ల దిగుబడి రావాల్సిన పంట 10 క్వింటాళ్లు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో బాధిత రైతులు చేతికొచ్చిన పంటను చూసి లబోదిబోమంటున్నారు. గ్రామానికి చెందిన గడ్డం అప్పిరెడ్డి అనే రైతు 10 ఎకరాలు కౌలుకు తీసుకుని యాసంగి మొక్కజొన్న సాగు చేశాడు. పది ఎకరాల్లో కలిపి నాలుగు రకాల కంపెనీల విత్తనాలను నాటాడు. మూడు ఎకరాల్లో 'మైకో 4060' రకానికి చెందిన విత్తనాలు నాటాడు. పది ఎకరాల్లో పంట చూడటానికి మంచిగానే ఎదిగినా కాతకు వచ్చేసరికే ఈ మూడెకరాల్లో కంకి సైజ్ పెరగలేదు. క్రమంగా పెరుగుతుందని భావించగా పంట కోతకు వచ్చినా సాధారణ కంకితో పోలిస్తే ఈ మొక్కజొన్న కంకి సగం సైజు కూడా పెరగలేదు. వీటిలో కూడా అక్కడక్కడ సరిగా విత్తనాలు రాలేదు. పంట నష్టపోయానని భావించిన రైతు విత్తనాలు కొనుగోలు చేసిన డీలరుకు విషయం చెప్పగా సదరు కంపెనీకి తెలియజేయగా వారి ప్రతినిధులు వచ్చి పంటను పరిశీలించారు. వాతావరణంలో మార్పుల వల్ల దిగుబడి సరిగా రాలేదు.. తమ సంస్థ పెద్దలకు తెలియజేస్తామని చెప్పారు. ఇప్పటికి నెలరోజులు దాటినా ఎలాంటి స్పందన లేదు. ఫోన్ చేస్తే మేము ఏమీ చేయలేం.. మీరు ఏం చేసుకుంటారో చేసుకోండని బెదిరింపు ధోరణితో మాట్లాడుతున్నారని రైతు అప్పిరెడ్డి వాపోయాడు. వ్యవసాయ అధికారులకు విషయం తెలుపగా చర్యలు తీసుకుంటామని చెప్పినా ఇప్పటివరకూ స్పందన లేదు. పది ఎకరాల్లో ఒకేసారి విత్తనాలు నాటగా ఈ రకం మాత్రమే సరిగా పండలేదని, మిగిలిన పంట మంచిగా ఉన్నదని, భూమి, సాగువిధానంలో



తేడా ఉంటే మొత్తం పంటపోతుంది కానీ కేవలం ఈ రకం మాత్రమే ఎందుకు పండదని రైతు ప్రశ్నిస్తున్నాడు. ఎకరాకు 40 క్వింటాళ్ల వరకూ వచ్చే దిగుబడి ఈ మూడు ఎకరాల్లో 10 నుంచి 15 క్వింటాళ్లు రావటం కూడా కష్టమేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. గ్రామంలో ఈ రకం విత్తనాలతో సాగుచేసిన సుమారు 20మంది రైతుల మొక్కజొన్న పరిస్థితి కూడా ఇదేవిధంగా ఉండగా సుమారు 100 ఎకరాల్లో పంట నష్టపోతున్నారు. ఎంత తిరిగినా పరిహారంరాదని, తిరగటానికి అదనపు ఖర్చులు తప్ప ఉపయోగంలేదని మానుకున్నామని రైతులు చెబుతున్నారు. దిగుబడి సరిగా వస్తేనే పెట్టుబడులు రావటం కష్టంగా ఉందని, ఈ అరకొర దిగుబడి వల్ల తీవ్రంగా నష్టపోతామని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు. ఈ విషయంపై మండల వ్యవసాయ అధికారి సరితను వివరణ కోరగా గడ్డం అప్పిరెడ్డి అనే రైతు తమకు ఫిర్యాదు చేయగా పై అధికారులకు తెలియజేశామని, వారు రెండు మూడురోజుల్లో శాస్త్రవేత్తలను పంపిస్తామని చెప్పారన్నారు. పూర్తి పరీక్షలు చేసిన తరువాత విత్తనాల్లో సమస్య ఉన్నట్లు తేలితే చర్యలు తీసుకుంటామన్నారు.

**నాసిరకం విత్తనాలతో మోసపోయా..**

పదెకరాలు కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాను. మూడెకరాల్లో వేసిన పంట మాత్రమే సరిగా దిగుబడి రాలేదు.. మిగిలిన పంట బాగానే ఉంది. ఎకరాకు 40 క్వింటాళ్ల దిగుబడి రావాల్సింది ఈ మూడెకరాల్లో 10 క్వింటాళ్లు వచ్చే పరిస్థితి లేదు. విత్తనాలు అమ్మిన డీలర్‌కు తెలుపగా కంపెనీవారు వచ్చి పంట చూసి తమ సంస్థ పెద్దలకు చెబుతామని వెళ్లారు.. ఫోన్ చేస్తే బెదిరింపు ధోరణితో మాట్లాడుతున్నారు. అధికారులు సదరు విత్తనాల కంపెనీపై చర్యలు తీసుకొని నాకు న్యాయం చేయాలి.

# గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల శిక్షణకు ఆదరణ కరువు



**కారేపల్లి :** గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల శిక్షణకు ఆదరణ కరువైంది. పంచాయతీ వార్డు సభ్యులకు పరిపాలన అంశాలతో పాటు గ్రామాభివృద్ధి, ప్రభుత్వ పథకాలు, పంచాయతీ విధులు, నిధులపై అవగాహన కల్పించేందుకు తెలంగాణ పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల వారిగా ఎంపిక చేసి వార్డు సభ్యులకు శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని సంబంధిత అధికారులు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి నిర్వహిస్తున్నారు. ఖమ్మం జిల్లా సింగరేణి(కారేపల్లి) మండల పరిధిలోని అప్పాయిగూడెం రైతు వేదికలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులకు వార్డు సభ్యులు నామమాత్రంగా హాజరు కావడంతో అధికారులు శిక్షణ తరగతులను మ..మ.. అనిపిస్తున్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వార్డు సభ్యులను మూడు గ్రూపులుగా విభజించి, ఒక్కో గ్రూపులో 116 మందికి పైగా చొప్పున వార్డు సభ్యులను చేర్చి మూడు విడతలుగా ఐదు రోజులు శిక్షణ ఇస్తున్నారు. మొదటి విడతలో భాగంగా సోమవారం నిర్వహించిన శిక్షణకు 116 మంది వార్డు సభ్యులు హాజరు కావాల్సి ఉండగా సగం మందికి అటు ఇటుగా మాత్రమే హాజరయ్యారు. గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల పాలన పరమైన శిక్షణకు ఐదు రోజులు సమయం కేటాయించని వార్డు సభ్యులు ఐదు సంవత్సరాలు ప్రజల సమస్యల పరిష్కారానికి ఎంత చిత్తశుద్ధితో పని చేయగలుగుతారో అని వివిధ గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వార్డు సభ్యుల శిక్షణకు సభ్యులు హాజరు కాకపోవడం అంటే అది శిక్షణ లోపమా? శిక్షకుల లోపమా? అధికారుల లోపమా? అనే ప్రశ్న తలెత్తుతున్నాయి. నూతనంగా ఎన్నికైన పంచాయతీ పాలక మండలి సభ్యులతో అధికారులు సమన్వయం చేసుకుని శిక్షణ తరగతులను జయప్రదంగా నిర్వహించాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.

# ఓవర్‌లోడ్‌తో మోటార్లు పనిచేయక పంటలు ఎండిపోతున్నయ్..

## అదనపు ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయాలని ఆదివారంపేట రైతుల వినతి

**రామగిరి :** కరెంట్ ఓవర్‌లోడ్ సమస్యతో వ్యవసాయ మోటార్లు సరిగా పనిచేయక పంటలు ఎండిపోతున్నాయని ఆదివారంపేట గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై అధికారులు స్పందించి వెంటనే అదనపు ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయాలని రైతులు పెద్దపల్లి కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఆదివారంపేట గ్రామంలో విద్యుత్ ఓవర్‌లోడ్ కారణంగా రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. వ్యవసాయ మోటార్లు సరిగా నడవకపోవడంతో పొలాలకు తగినంత నీరు అందడం లేదని రైతులు తెలిపారు. దీంతో సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై గతంలో ఒకసారి మళ్లీ సోమవారం కూడా కలెక్టర్‌ను కలిసి తమ సమస్యను వివరించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి పరిష్కారం లభించలేదని రైతులు తెలిపారు. ఇదే సమస్యపై రామగిరి తహసీల్దార్‌కు కూడా వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు తమ సమస్యను పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. అధికారులు తమ గ్రామాన్ని సింగరేణి విస్తరణ, ప్రభావిత



ప్రాంతంగా చూపిస్తూ సమస్యను పరిష్కరించడంలో ఆలస్యం చేస్తున్నారని రైతులు విమర్శించారు. అయితే ఆదివారంపేట గ్రామ శివారులో సింగరేణి సంస్థకు సంబంధించిన భూమి ఒక్క గుంట కూడా లేదని రైతులు స్పష్టం చేశారు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకొని అధికారులు తమ సమస్యను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. కరెంట్ ఓవర్‌లోడ్ కారణంగా దిగువ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా తక్కువగా వస్తోందని, దీనివల్ల వ్యవసాయ మోటార్లు పనిచేయక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని రైతులు తెలిపారు. కాబట్టి అధికారులు తక్షణమే స్పందించి అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి రైతులకు ఉపశమనం కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు.

# సమస్యల చట్టపర పరిష్కారానికి తక్షణ కృషి : ఎస్పీ నరసింహ

**సూర్యాపేట :** ప్రజల సమస్యలపై త్వరితగతిన చట్టపరమైన చర్యలు తీసుకుని బాధితులకు భరోసా కల్పించడంలో పోలీస్ శాఖ తక్షణ చర్యలు తీసుకుంటుందని సూర్యాపేట జిల్లా ఎస్పీ కె.నరసింహ తెలిపారు. పోలీసు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పిర్యాదుదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించి వారితో మాట్లాడారు. ఫిర్యాదుల ద్వారా వచ్చిన సమస్యల పరిష్కారానికై సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా తక్షణ ఆదేశాలు, సూచనలు చేసి అవసరమైన దిశానిర్దేశం చేశారు. ఎలాంటి సమస్యలు ఉన్నా ప్రజలు పైరవీలు లేకుండా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా, నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగిం చుకోవాలని సూచించారు. చట్టబద్ధమైన విధానంలోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని, శాంతి భద్రతలను కాపాడుతూ ప్రజలకు మరింత చేరువగా ఉండడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు.

# పలు కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్ పరామర్శ

**కారేపల్లి, మార్చి 23 :** ఖమ్మం జిల్లా సింగరేణి మండల పరిధిలోని భాగ్యనగర్ తండాకు చెందిన మాజీ జడ్పీటీసీ వాంకుడొత్ జగన్ నాయక్ సతీమణి జమున ఇటీవల అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుంది. వైరా నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే లావుడియా రాములు నాయక్ సోమవారం వారి ఇంటికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు పాత కమలపురంలో గుండెపోటుతో మృతి చెందిన సర్పంచ్ తేజవత్ బాబురావు ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. అనంతరం ఆదే గ్రామానికి చెందిన కట్ల భద్రమ్మ ఇటీవల మరణించడంతో వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట ఎంపీటీసీల సంఘం మండల మాజీ అధ్యక్షుడు ధరవత్ పాండ్య నాయక్, మండల రైతుబంధు మాజీ కన్వీనర్ గుగులోత్ శ్రీను, ఇల్లెందు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వాంకుడొత్ నరేశ్, టీడీపీ పాత కమలాపురం గ్రామ పంచాయతీ అధ్యక్షుడు కొత్త తిరుపతయ్య,

# రేపే జైనూర్‌లో వారపు సంతల వేలం పాట

**జైనూర్ :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండల కేంద్రంలో ప్రతి గురువారం నిర్వహించే తై బజార్, పశువుల సంతలను ఈ నెల 24న వేలంపాట వేస్తున్నట్లు జైనూర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కొడప ప్రకాష్, గ్రామ పంచాయతీ ఇంచార్జి ఈవో ఆనందరావ్ ఒక ప్రకటనలో తెలిపారు. వేలంపాటలో పాల్గొనే వారు తై బజార్‌కు ఒక్కొక్కరు రూ.50 వేలు, పశువుల సంత వేలం పాటలో పాల్గొనే వారు రూ.లక్ష చ



# ఈ సమస్యలున్న వారు బొప్పాయిని తినొద్దు

బొప్పాయి ఆరోగ్యానికి, ముఖ్యంగా మలబద్ధకం వంటి సమస్యలకు చాలా మేలు చేస్తుంది. అయితే, బొప్పాయికి శరీరాన్ని వేడి చేసే గుణం ఉంది. కడుపు సమస్యలకు అరటిపండ్లు, బొప్పాయి వంటి పండ్లను తినడం చాలా మంచిది. బొప్పాయిలో పాపైన్ అనే ఎంజైమ్ ఉంటుంది.. ఇది ప్రోటీన్లను విచ్ఛిన్నం చేసి జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అందువల్ల, మలబద్ధకంతో బాధపడేవారు బొప్పాయి తినాలని సలహా ఇస్తారు. ఇది ఆరోగ్యానికి అనేక ఇతర విధాలుగా కూడా మేలు చేస్తుంది. అయితే, బొప్పాయికి శరీరాన్ని వేడి చేసే గుణం ఉంది. కావున.. వేసవి కాలంలో బొప్పాయి పండును తినవచ్చా? దీనిని వేసవిలో తినడం సురక్షితమేనా, లేదా దాని వల్ల ఆరోగ్యానికి హాని కలుగుతుందా అని చాలా మంది సందేహం వ్యక్తంచేస్తుంటారు. ఎందుకంటే, ఈ సమయంలో శరీరాన్ని చల్లబరచడానికి, చల్లదనాన్నిచ్చే గుణం ఉన్న పండ్లను తినమని సిఫార్సు చేస్తారు. కాబట్టి, వేసవిలో బొప్పాయి తినవచ్చా? లేదా? దీని గురించి ఆరోగ్య నిపుణులు ఏం చెబుతున్నారు..? మీరట్‌కు చెందిన డైటీషియన్ అయేషా పర్వీన్ వివరించిన ప్రకారం.. బొప్పాయిని తేలికపాటి వేడినిచ్చేదిగా పరిగణించినప్పటికీ, ముఖ్యంగా పండినప్పుడు తింటే అది చల్లదనాన్ని కూడా ఇస్తుంది. వేసవిలో బొప్పాయి తినడం ఆరోగ్యానికి మేలు చేస్తుంది, ఎందుకంటే ఇందులో అధిక నీటి శాతం ఉంటుంది.. ఇది శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచడానికి, వడదెబ్బ నుండి రక్షించడానికి సహాయపడుతుంది. బొప్పాయి జీర్ణక్రియకు మేలు చేస్తుంది. ఇది మలబద్ధకం నుంచి ఉపశమనం కలిగించి, రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. బొప్పాయిలోని ఎంజైమ్‌లు కడుపును శుభ్రపరచడంలో సహాయపడతాయి. ఇది చర్మం కాంతివంతంగా ఉండటానికి కూడా దోహపడుతుంది. బొప్పాయిలో కేలరీలు తక్కువగా, పీచుపదార్థం ఎక్కువగా ఉండటం వల్ల బరువు తగ్గాలనుకునే వారికి కూడా ఇది ఒక మంచి ఎంపిక. బొప్పాయికి శరీరాన్ని వేడి చేసే గుణం ఉందని, దీనిని అధిక పరిమాణంలో తీసుకుంటే కొంతమందిలో ఎసిడిటీ గ్యాస్‌కు కారణం కావచ్చని నిపుణులు అంటున్నారు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు బొప్పాయిని తినే ముందు వైద్యుడిని సంప్రదించాలి. వేసవిలో బొప్పాయిని మజ్జిగ, పెరుగు, దోసకాయ వంటి చల్లని ఆహారాలతో కలిపి తీసుకోవడం కూడా మంచిది. ఇది శరీరంలోని వేడిని తగ్గించి, సమతుల్యతను కాపాడుతుంది. ఉదయాన్నే ఖాళీ కడుపుతో బొప్పాయి తినడం ప్రయోజనకరం.. కానీ బొప్పాయి పడని వారు లేదా కడుపులో మంటగా అనిపించేవారు వెంటనే దానిని తినడం మానేయాలి. ఎసిడిటీ లేదా గుండెల్లో మంటతో బాధపడేవారు ఖాళీ కడుపుతో బొప్పాయి తినకూడదు. వేసవిలో బొప్పాయి తినడం మంచిదే, కానీ దానిని పరిమిత పరిమాణంలో, సరైన పద్ధతిలో తీసుకోవాలని సూచిస్తున్నారు. అయితే.. ఏదైనా సమస్యతో బాధపడుతుంటే.. వైద్య నిపుణులను సంప్రదించడం మంచిది.

# మట్టికుండ నీటితో.. ఇన్‌డైజెషన్ ప్రాబ్లమ్స్‌కు చెక్



మట్టి కుండలో నీరు నిల్వ చేయడం వల్ల అది కేవలం చల్లబడటమే కాకుండా, నీటి నాణ్యత కూడా పెరుగుతుంది. మట్టిలో ఉండే సహజ సిద్ధమైన ఖనిజ లవణాలు నీటిలోకి చేరి, మన శరీరానికి అవసరమైన ఎలక్ట్రోలైట్స్ సమతుల్యతను కాపాడతాయి. ఎలక్ట్రానిక్ వస్తువులైన ఫ్రిజ్, వాటర్ ప్యూరిఫైర్ల కంటే ప్రకృతి సిద్ధమైన మట్టి కుండ నీరు ఆరోగ్యానికి ఎంతో మేలు. ఈ వేసవిలో మీ ఇంట్లో ఒక మట్టి కుండను ఏర్పాటు చేసుకుని, చల్లని, ఆరోగ్యకరమైన నీటిని తాగమని సూచిస్తున్నారు నిపుణులు. వేసవి కాలం రాగానే భానుడి భగభగలు మొదలవుతాయి. ఈ సమయంలో మన శరీరానికి నీటి అవసరం చాలా ఎక్కువ. ఎండల నుండి ఉపశమనం పొందడానికి చాలామంది ఫ్రిజ్‌లోని చల్లటి నీటిని తాగడానికి ఆసక్తి చూపుతారు. అయితే, ఫ్రిజ్ నీటి వల్ల గొంతు నొప్పి, జలుబు వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. దీనికి విరుద్ధంగా, మన పూర్వీకుల కాలం నుండి వస్తున్న 'మట్టి కుండ' నీరు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. మట్టి కుండను 'పేదవాడి ఫ్రిజ్' అని పిలిచినప్పటికీ, అందులోని ఆరోగ్య ప్రయోజనాలు మాత్రం అమూల్యమైనవి. మట్టి కుండకు ఉండే సూక్ష్మ రంధ్రాలు నీటిని సహజంగా వడపోస్తాయి. ఇది నీటిలోని మలినాలను తొలగించడమే కాకుండా, హానికరమైన బ్యాక్టీరియాను నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఫ్రిజ్ నీటిలా కాకుండా, కుండ నీరు బయటి ఉష్ణోగ్రతకు అనుగుణంగా చల్లబడుతుంది, దీనివల్ల శ్వాసకోశ సమస్యలు లేదా జలుబు చేసే ప్రమాదం ఉండదు.మట్టి కుండ నీరు తాగడం వల్ల తిన్న ఆహారం త్వరగా జీర్ణమవుతుంది. గ్యాస్, ఎసిడిటీ, కడుపు ఉబ్బరం వంటి సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది.ఈ నీరు శరీరంలోని గ్లూకోజ్ స్థాయిలను అదుపులో ఉంచుతుంది. వేసవిలో ఎండల వల్ల కోల్పోయిన శక్తిని తిరిగి పొందడానికి, వడదెబ్బ నుండి రక్షించుకోవడానికి ఇది ఒక అద్భుత ఔషధం. మట్టిలో ఉండే విటమిన్లు, మినరల్స్ నీటిలో కలవడం వల్ల శరీర రోగనిరోధక శక్తి పెరుగుతుంది. వేసవిలో చెమట వల్ల వచ్చే చర్మ సమస్యలను, జిడ్డును తగ్గించడంలో కుండ నీరు సహకరిస్తుంది.మట్టిలో ఎలక్ట్రోమ్యాగ్నెటిక్ ఎనర్జీ ఉంటుంది. ఎండలో తిరగడం వల్ల శరీరం డీహైడ్రేట్ అయినప్పుడు, కుండ నీరు తాగితే శరీరంలో ఎలక్ట్రోలైట్స్ స్థాయిలు వెంటనే పెరుగుతాయి. ఇది తక్షణ శక్తిని ఇస్తుంది.

# ఉసిరి వీరికి విషంతో సమానం!



ఆరోగ్య స్పృహ ఉన్నవారు చాలా మంది తమ ఉదయాన్ని గ్లాసుడు ఉసిరి రసంతో ప్రారంభిస్తారు. ఆయుర్వేదంలో ఉసిరితో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లకు నిలయమైన ఈ పండు, రోగనిరోధక శక్తిని పెంచడంలో అద్భుతంగా పనిచేస్తుంది. అయితే కొన్ని రకాల ఆరోగ్య సమస్యలు ఉన్నవారు ఉసిరి తీసుకోవడం ప్రాణాంతకమని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఉసిరి సాధారణంగా చక్కెరను నియంత్రించడంలో సహాయపడుతుంది. కానీ ఇప్పటికే తక్కువ రక్త చక్కెర స్థాయిలు (హైపోగ్లైసీమియా) ఉన్నవారు దీనిని ఎక్కువగా తింటే ప్రమాదంలో పడతారు. ముఖ్యంగా మధుమేహం కోసం మందులు తీసుకుంటున్న వారికి చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పడిపోవడం తీవ్రమైన ప్రమాదాలకు దారితీస్తుంది.ఉసిరిలో పొటాషియం, ఆక్సలేట్ పుష్కలంగా ఉంటాయి. మూత్రపిండాల్లో రాళ్ల సమస్యలు ఉన్నవారికి లేదా దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధులతో బాధపడుతున్నవారికి ఈ పండు చాలా ప్రమాదకరం. ఆక్సలేట్ రాళ్లు ఏర్పడే ధోరణిని మరింత పెంచుతుంది. ఇది పరిస్థితిని మరింత క్లిష్టతరం చేస్తుంది. అలాగే శస్త్రచికిత్స జరిగినవారు లేదా జరగబోయేవారు ఉసిరికాయకు దూరంగా ఉండటం ఉత్తమం. ఉసిరికాయ రక్తం గడ్డకట్టడాన్ని నిరోధిస్తుందని అధ్యయనాలు వెల్లడించాయి. దీని ఫలితంగా శస్త్రచికిత్స సమయంలో అధిక రక్తస్రావం అయ్యే ప్రమాదం పెరుగుతుంది. వైద్యుల ప్రకారం ఏదైనా శస్త్రచికిత్సకు కనీసం రెండు వారాల ముందు ఉసిరికాయ తినడం మానేయాలి.ఉసిరి పుల్లగా, ఆమ్ల స్వభావం కలిగి ఉంటుంది. గుండెల్లో మంట లేదా జీర్ణాశయ సమస్యలతో బాధపడేవారు ఖాళీ కడుపుతో ఉసిరి తినడం వల్ల అసౌకర్యం పెరుగుతుంది. ఇందులో ఉండే పీచుపదార్థం జీర్ణక్రియకు సహాయపడినప్పటికీ, కడుపులో పుండ్లతో బాధపడేవారికి దీనిలోని అధిక ఆమ్లం బాధాకరంగా ఉంటుంది. ఉసిరి కాలేయాన్ని శుభ్రంగా ఉంచడానికి సహాయపడుతుంది. కానీ దీనిని అల్లం లేదా మిరియాలతో కలిపి తీసుకోవడం వల్ల కాలేయ ఎంజైమ్‌లపై అదనపు ఒత్తిడి పడుతుంది. దీర్ఘకాలంలో ఇది కాలేయ పనితీరును తగ్గించగలదని నిపుణులు భావిస్తున్నారు.

# ద్రాక్ష తింటే ఒంట్లో జరిగేది ఇదే!



ఎరుపు, ఆకుపచ్చ, నలుపు.. ఇలా ద్రాక్షలోని మూడు రకాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అయితే, వాటి ప్రయోజనాల విషయానికి వస్తే దాదాపు అన్నింటిలో శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి.. ఇవి గుండె ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. ఇవి వాపును తగ్గించి, కణాలను దెబ్బతినకుండా కాపాడతాయి. ద్రాక్షలో విటమిన్లు సి, కె ఉంటాయి. ఇవి ఫైబర్‌కు కూడా మంచి మూలం. వేసవి కాలంలో ఆరోగ్యానికి మేలు చేసే పండ్లను విరివిగా తింటారు. అవి మీ శరీరాన్ని తేమగా, తాజాగా ఉంచుతాయి. ఇలాంటి అద్భుతమైన జ్యూసీ పండ్లలో ద్రాక్ష ఒకటి. అనేక రంగులలో లభించే ద్రాక్షలు తీపిగా, పలుపుగా ఉంటాయి.. నలుపు, ఆకుపచ్చ, ఎరుపు రంగు ద్రాక్ష.. మూడు కూడా పోషకాలతో సమృద్ధిగా ఉంటాయి. వాటిలో విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు అధిక మొత్తంలో ఉంటాయి. అందుకే.. వీటిని తినాలని చెబుతున్నారు డైటీషియన్లు.. ద్రాక్షలను వైన్ తయారీలో కూడా ఉపయోగిస్తారు. ద్రాక్షలో యాంటీ ఆక్సిడెంట్లు (రెస్వెరాట్రాల్).. ఫైబర్, ప్రోటీన్, ఐరన్, కాపర్, ఫోలేట్, విటమిన్లు సి, ఎ, కె, బి వంటి ఆరోగ్యానికి మేలు చేసే అనేక పోషకాలు ఉన్నాయి.. రోగనిరోధక వ్యవస్థ కోసం ? ద్రాక్షలో విటమిన్ సి, విటమిన్ బి6, ఐరన్ ఉంటాయి. ఈ పోషకాలు రోగనిరోధక శక్తిని పెంచి, ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి సహాయపడతాయి. అందువల్ల, మీ రోగనిరోధక శక్తిని బలోపేతం చేసుకోవడానికి ద్రాక్షను రెగ్యులర్ గా తినవచ్చు.మలబద్ధకాన్ని నివారిస్తుంది: ద్రాక్షలో పీచుపదార్థం బాగా ఉంటుంది. ఇది జీర్ణ ఎంజైమ్‌ల ఉత్పత్తిని ప్రోత్సహిస్తుంది. దీనివల్ల జీర్ణ సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. అలసటను ఎదుర్కోవడానికి: ద్రాక్షలో విటమిన్లు, మెగ్నీషియం, ఫాస్ఫరస్, ఐరన్, రాగి ఉంటాయి. ఇవి మీ శరీరానికి శక్తిని అందించి, అలసటను తగ్గించడంలో సహాయపడతాయి. కళ్ళకు మేలు: ద్రాక్షలో ఉండే పాలిఫెనాల్స్ ? రెస్వెరాట్రాల్, మాక్యులర్ డీజెనరేషన్, ఆక్సిడేటివ్ స్ట్రెస్, వాపు, శుక్లాలు వంటి కంటి సమస్యలను నివారించడంలో సహాయపడతాయి. ద్రాక్షను తినడం అంధత్వాన్ని నివారించడంలో కూడా సహాయపడవచ్చు. అందువల్ల, కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ద్రాక్షను తినవచ్చంటున్నారు ఆరోగ్య నిపుణులు..రక్తంలో చక్కెర నియంత్రణ : మధుమేహం ఉన్నవారికి ద్రాక్షపండ్లు కూడా మేలు చేస్తాయి. వాటికి మధుమేహ నిరోధక గుణాలు ఉన్నాయి.. అవి రక్తంలో చక్కెరను నియంత్రించడంలో సహాయపడతాయి.కొలెస్ట్రాల్ తగ్గించుకోవడానికి : మీరు ద్రాక్షపండ్లను తినడం ద్వారా కొలెస్ట్రాల్‌ను తగ్గించుకోవచ్చు. ద్రాక్ష రసంలో ఫ్లేవనాయిడ్లు, యాంటీఆక్సిడెంట్ గుణాలు ఉంటాయి. ఇవి కొలెస్ట్రాల్‌ను నియంత్రించడంలో సహాయపడతాయి. ఎముకలను బలపరుస్తుంది: ద్రాక్షలో రాగి, ఐరన్, మాంగనీస్ వంటి పోషకాలు ఉంటాయి. ఇవి ఎముకలను బలపరిచి, బోలు ఎముకల వ్యాధి (ఆస్టియోపొరోసిస్) ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి.

# బాహుబలి, ఆర్ఆర్ఆర్ రికార్డ్స్ బ్రేక్..



ఇండియన్ బాక్సాఫీస్ దగ్గర ‘ధురంధర్ 2’ సినిమా సంచలనాలు సృష్టిస్తోంది. బీభత్సమైన అంచనాలతో బరిలోకి దిగిన ఈ మూవీ ఉత్తరాదితో పాటు దక్షిణాదిలోని బీ,సీ సెంటర్లలోనూ హవా చూపిస్తుండటం ట్రేడ్ వర్గాలని ఆశ్చర్యపరుస్తోంది. మొదటి రోజు నుంచి వందల కోట్ల వసూళ్లు సాధిస్తున్న ఈ చిత్రం ఇప్పుడు తొలి వీకెండ్ పూర్తయ్యేసరికి ఊహించని రికార్డులు సొంతం చేసుకుంది. ఇంతకీ నాలుగు రోజుల కలెక్షన్స్ ఎన్ని కోట్లు వచ్చాయంటే? తొలి వీకెండ్ పూర్తయ్యేసరికి ‘ధురంధర్ 2’ చిత్రానికి రూ.750 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ వచ్చినట్లు తెలుస్తోంది. ఆదివారం ఒక్కరోజే కేవలం మన దేశంలోనే రూ.115 కోట్లు వచ్చినట్లు తెలుస్తోంది. ఇదో రికార్డ్. ఇప్పటివరకు వీకెండ్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా ‘పుష్ప 2’ రూ.762 కోట్లతో అగ్రస్థానంలో ఉండగా.. దీని తర్వాతి స్థానంలోకి ‘ధురంధర్ 2’ వెళ్లింది. ఈ క్రమంలోనే బాహుబలి 2 (రూ.591 కోట్లు), ఆర్ఆర్ఆర్ (రూ.470 కోట్లు), కల్కి 2898 ఏడీ (రూ.500 కోట్లు) తదితర రికార్డులు బ్రేక్ చేసింది. మరోవైపు బాలీవుడ్‌లోనూ ఇప్పటివరకు షారుఖ్ ఖాన్ ‘పఠాన్’ పేరిట రూ.287 కోట్ల కలెక్షన్స్ రికార్డ్ ఉంది. దీన్ని ‘ధురంధర్ 2’ అధిగమించడంతో పాటు సరికొత్త ఘనత సాధించింది. చూస్తుంటే ఇప్పుడప్పుడే ఈ చిత్ర రచ్చ ఆగేలా లేదు. తొలి వారం పూర్తయ్యేసరికి రూ.1000 కోట్లు సాధించడం పక్కా అనిపిస్తుంది. అలానే రూ.2000 కోట్ల మార్క్‌ని కూడా త్వరలోనే అందుకునే అవకాశముందని విశ్లేషకులు మాట్లాడుకుంటున్నారు.



# ముంబై స్లమ్స్‌లో విజయ్ దేవరకొండ ‘రౌడీ జనార్ధన’..!

టాలీవుడ్ యాక్టర్ విజయ్ దేవరకొండ బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టాడని తెలిసిందే. వీటిలో ఒకటి రాహుల్ సంకీర్త్యన్‌తో చేస్తున్న పీరియడ్ యాక్షన్ డ్రామా. విజయ్ మరోవైపు దిల్ రాజు నిర్మాణంలో రవికిరణ్ కోలా దర్శకత్వంలో ఓ రూరల్ మాస్ డ్రామాకు కమిటవగా.. ఈ చిత్రానికి రౌడీ జనార్ధన అనే టైటిల్ కూడా ఖరారు చేశారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఆసక్తికర వార్త ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో గ్రాండ్ స్కేల్‌లో ఉండబోయే యాక్షన్ సీక్వెన్స్‌ను విజయ్ టీం డిజైన్ చేస్తుందట. ముంబై స్లమ్స్ ఏరియాలో రాబోయే హై ఆక్టేన్ ఫైట్ సీక్వెన్స్ సినిమాకే హైలెట్‌గా నిలువబోతుందట. ఇంటెన్స్, రియలిస్టిక్ యాక్షన్ ఎక్స్‌పీరియన్స్ అందించేలా ఈ ఎపిసోడ్ ఉండనుందిని ఇన్‌సైడ్ టాక్. ఇప్పటికే విజయ్ దేవరకొండ ట్రాన్స్‌ఫార్మేషన్ సినిమాపై మంచి బజ్ క్రియేట్ చేస్తుంది. రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో రియల్ మాస్ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ చిత్రంలో విజయ్ పాత్ర పేరు జనార్ధన్ కాగా, ఆయన నాన్న పేరు కూడా జనార్ధనేనని ఇన్‌సైడ్ టాక్. విజయ్ దేవరకొండకు ‘రౌడీ’ అనే ట్యాగ్ ఎప్పటి నుంచో ఉంది. ఇప్పుడు రౌడీ టైటిల్‌తో సినిమా వస్తుండడంతో ఫ్యాన్స్ అంతా ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఈ సినిమాతో విజయ్ తన విశ్వరూపం చూపించనున్నాడని కామెంట్ చేస్తున్నారు.



# ‘తెరచాప’ ట్రైలర్ రిలీజ్

అనన్య క్రియేషన్స్ బ్యానర్‌పై కైలాష్ దుర్గం నిర్మాతగా తీస్తున్న సినిమా ‘తెరచాప’. జోయల్ జార్జ్ దర్శకత్వం వహించారు. నవీన్ రాజ్ శంకరపు, పూజ సుహాసిని, శ్రీలు హీరోహీరోయిన్లుగా నటించారు. రాజీవ్ కనకాల, పృథ్వీరాజ్, జగదీష్ ప్రతాప్ తదితరులు ఇతర పాత్రలు చేశారు. ప్రజల్ క్రిష్, ఎం.ఎల్ రాజా సంగీతాన్ని అందించారు. విడుదల తేది దగ్గరవుతున్న సందర్భంగా ఈ సినిమా ట్రైలర్ ను విడుదల చేశారు. తెరచాప ట్రైలర్ చూస్తుంటే సముద్రతీరంలో జరిగే ఒక ఊరి కథలా అనిపిస్తుంది. ఊరంటే మనుషుల మధ్య ప్రేమ, ఆప్యాయతలుతో పాటు రాజకీయాలు, భేద భావాలు ఉండడమూ సహజమే. అలాంటి పరిస్థితుల మధ్య ఒక యువకుడు తన ఊరిలో ఉన్న పరిస్థితులపై ఎలా పోరాడాడు? అనేదే స్టోరీ.



# మైక్రో ఫైనాన్స్ మోసాలపై సింగర్ మంగ్లీ క్లారిటీ

**నా పేరుతో డబ్బులు వసూలు చేస్తే నమ్మొద్దు..**

ప్రఖ్యాత ఫోక్ సింగర్ మంగ్లీ పేరుతో మైక్రో ఫైనాన్స్ వ్యాపారం జరుగుతోందని వస్తున్న వార్తలపై ఆమె ఘాటుగా స్పందించారు. తనకు అలాంటి ఎలాంటి వ్యాపారాలతో సంబంధం లేదని స్పష్టం చేస్తూ, సోషల్ మీడియా వేదికగా ఓ అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల కొందరు వ్యక్తులు మంగ్లీ పేరును ఉపయోగిస్తూ మైక్రో ఫైనాన్స్ పేరిట డబ్బులు వసూలు చేస్తున్నారనే వార్తలు వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆమె స్పందిస్తూ, “నా పేరుతో డబ్బులు సేకరిస్తున్నారని వస్తున్న వార్తలు పూర్తిగా అసత్యం. నాకు ఆ వ్యక్తులతో గానీ, వారి ఫైనాన్స్ వ్యాపారాలతో గానీ ఎలాంటి సంబంధం లేదు” అని తెలిపారు. మంగ్లీ తన ప్రకటనలో , తనను మరియు తన కుటుంబ సభ్యులను చాలా మంది ప్రొఫెషనల్ ఈవెంట్స్ కోసం సంప్రదిస్తుంటారని చెప్పారు. అయితే, ఆ ఈవెంట్స్‌కు సంబంధించిన ఆహ్వానాల వరకే తమకి పరిచయం ఉంటుందని, వారి వ్యక్తిగత వ్యాపారాల గురించి తాము ఎలాంటి బాధ్యత వహించబోమని స్పష్టం చేశారు. అలాగే, తన పేరును ఉపయోగించి మోసాలకు పాల్పడటం అన్యాయమని, ఇది తన వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కరెన్సీ వీడియోలు, ఫైనాన్స్ వ్యవహారాలకు తమ కుటుంబానికి ఎలాంటి సంబంధం లేదని ఆమె మరోసారి క్లియర్ చేశారు. నా ప్రొఫెషనల్ ఈవెంట్స్ తప్ప నాకు ఎలాంటి వ్యాపారాలు లేవు. ఎవ్వరైనా నా పేరు చెప్పి డబ్బులు అడిగితే దయచేసి నమ్మకండి. అలాంటి మోసాలకు గురైన వారికి న్యాయం చేయాలని పోలీస్ శాఖను కోరుతున్నాను అని మంగ్లీ విజ్ఞప్తి చేశారు. ఈ ప్రకటనతో, మంగ్లీ పేరును వాడుకొని జరుగుతున్న మోసాలపై ప్రజల్లో అవగాహన పెరిగే అవకాశం ఉంది. ఇకపై ఇలాంటి ఘటనలపై జాగ్రత్తగా ఉండాలని ఆమె అభిమానులకు సూచించారు.ఇక ఇదిలా ఉంటే ఇటీవల మంగ్లీ పాన్-ఇండియా చిత్రం ఖఃణ: ది డెవిల్ సినిమా కోసం ఒక పాట పాడింది. ‘సర్కే చునర్ తేరి సర్కే’ పాటలో డబుల్ మీనింగ్ లిరిక్స్ ఉన్నాయనే ఆరోపణలతో సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి.ఈ క్రమంలో మంగ్లీ సోషల్ మీడియాలో స్పందిస్తూ... ‘ప్రజల భావోద్వేగాలను గౌరవిస్తూ ఈ పాటను తొలగించాం. అనుకోకుండా జరిగిన పొరపాటుకు హృదయపూర్వక క్షమాపణలు’ అని తెలిపారు.వీశీజఅవం

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com